ప్రతి నిత్యం తాజా సమాచారంతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

Publisher&Editor: 9391690609,Office :7893003409

aksharamtsnews@gmail.com https//www.facebook.com/aksharamnewspaper/

www.aksharamtelugudaily.com

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

శుక్రవారం 7 జూన్ 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 07 సంచిక : 78 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్..!



## విభజన సమస్యలు

# పరిష్కరించుకుందాం

### చంద్రబాబుతో రేవంత్



**హైదరాబాద్, జూన్ 6 (అక్షరం న్యూస్)**

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గురువారం మధ్యాహ్నం ఫోన్ చేశారు. ఏపీలో అఖండ విజయం సాధించిన చంద్రబాబుకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని రేవంత్ ఆకాంక్షించారు. విభజన అంశాల పరిష్కారానికి సహకరించాలని చంద్రబాబును రేవంత్ రెడ్డి కోరారు.

కాగా, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ 135, జనసేన 21, వైఎస్సార్‌సీపీ 11, బీజేపీ 8 స్థానాల్లో గెలుపొందిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఏర్పాటుకు పూర్తిస్థాయి మెజార్టీ సాధించింది టీడీపీ. ఈ నేపథ్యంలో 12వ తేదీన చంద్రబాబు నాయుడు ఏపీ సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల జారీకి

# కీలక నిర్ణయం



**హైదరాబాద్, జూన్ 6 (అక్షరం న్యూస్)**

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియడంతో చాలా కాలంగా పేదలకు అందకుండా నిల్చిపోయిన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులపైసర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పునరుద్దరిస్తూ నిర్ణయించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కొంత కాలంగా ఈ ప్రక్రియ నిల్చిపోయింది. దీంతో ఆపన్నులు అనేకమంది ఇబ్బందులకు గురవుతున్నారు.నిరుపేదల వైద్య సాయంలో కొంత సందిగ్ధత చోటుచేసుకున్నది. ఎన్నికల కోడ్ కారణంగా చెక్కులపంపిణీ నిల్చిపోయింది. అదేవిధంగా గత ప్రభుత్వం జారీ చేసి మధ్యలోనే నిలిపివేసిన 60వేల పైచిలుకు సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులను కొత్త ప్రభుత్వం ఆమోదించింది. ఈ చెక్కులను జారీ చేస్తున్నారు. వీటికి జారీకి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఒకట్రెండు రోజుల్లో చెక్కులు లబ్దిదారులకు చేరనున్నాయి.

## ఇకపై సింగరేణిలో పాలన

# పరుగులు పెట్టాలి

### సింగరేణి ఎండీ ఎన్.బలరామ్



**హైదరాబాద్, జూన్ 6 (అక్షరం న్యూస్)**

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో సింగరేణిలో పరిపాలన పరుగులు పెట్టాలని, కోడ్ నేపథ్యంలో నిలిచిన సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగులకు అందాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పూర్తి చేయాలని సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరాం ఆదేశించారు.

సంస్థ ద్వారా చేపట్టే ప్రాజెక్టులు, కొత్త కార్యక్రమాలను త్వరగా పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని, ఈ విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం ఆయన హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి 25 మందికి పైగా శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఇప్పటి వరకు ఉత్పత్తి, రవాణాపై మాత్రమే నెలవారీ సమీక్షలు నిర్వహించేవారని.. ఇక నుంచి రక్షణ, సంక్షేమ శాఖతోపాటు మిగతా అన్ని శాఖల పనితీరుపై నెలవారీ సమీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా శాఖలకు అప్పగించిన పనుల పురోగతిని నెలవారీగా తెలుసుకుంటామని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రయివేటు రంగానికి పోటీగా మన సామర్థ్యాలను,

# ఎంపీల చేరికలు షురూ..

## మరింత పెరిగిన కాంగ్రెస్ బలం..

ముంబై, జూన్ 06: రోజులు గడుస్తున్నా కొద్ది హస్తిన రాజకీయాలు మరింత రక్తికట్టిస్తున్నారు. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కొద్ది మంది సభ్యులు మాత్రమే తక్కువగా ఉండటంతో.. ఆ సభ్యులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే.. చేరికలను ప్రోత్సహిస్తోంది. తాజాగా మహారాష్ట్ర సంగ్లీ లోక్‌సభ స్వతంత్ర ఎంపీ విశాల్ ప్రకాష్ బాబు పాటిల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సమక్షంలో ఎంపీ విశాల్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. విశాల్ చేరికతో కాంగ్రెస్ ఎంపీల సంఖ్య 100కు చేరింది.

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 99 ఎంపీ స్థానాల్లో గెలుపొందింది. ఇండియా కూటమి మొత్తం కలిపి 232 స్థానాల్లో గెలిచింది. అధికారం చేపట్టాలంటే 272 సీట్లు అవసరం. అయితే, ఆ మేజిక్ ఫిగర్‌కు ఇంకా 40 సీట్లు అవసరం. ఇప్పుడు ఒక ఎంపీ చేరడంతో క్రమంగా కాంగ్రెస్ బలం పెరుగుతోంది. మరికొంత మంది ఎంపీలు కూడా చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.



# టీడీపీ దాడులతో ఏపీలో భయానక వాతావరణం

### వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 6 (అక్షరం న్యూస్)**

తెలుగుదేశం పార్టీ దాడులతో రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత భయానక వాతావరణం నెలకొందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటుకాకముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటుకాకముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. అధికారపార్టీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారిపోయింది. వెరసి ఐదేళ్లుగా పటిష్టంగా

## మొదటి ప్రాధాన్యత ఓట్ల

# లెక్కింపు పూర్తి..

### ఎవరికీ రాని మెజార్టీ

నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డికి 1,04,248 ఓట్లు వచ్చాయి. ఇక బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి 43,313 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ 29,697 ఓట్లు వచ్చాయి.ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలవాలంటే మొదటి ప్రాధాన్యత ఓట్లలో 1,55,095 ఓట్లు రావాల్సి ఉంది. కానీ కోటా ఓట్లు ఎవరికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును చేపడుతున్నారు.



# జూన్ 8న కాదు 9న..

## మారిన మోదీ ప్రమాణ స్వీకారం తేదీ



న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా జూన్ 9న ప్రమాణ స్వీకారం చేస్తారని తెలుస్తున్నది. తొలుత జూన్ 8న శనివారం మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఆదివారం సాయంత్రం 6 గంటలకు మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మారినట్లు సమాచారం. దేశంలో నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవిని మోదీ చేపట్టనున్నారు.కాగా, మోదీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి విదేశీ నేతలను కూడా ఆహ్వానించారు. దక్షిణాసియా అగ్రనేతలకు ఆహ్వానం అందిస్తున్నట్లు తెలుస్తున్నది. బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్ దేశాధినేతలకు ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా ఇప్పటికే మోదీ ఆహ్వానాన్ని అంగీకరించినట్లు సమాచారం.

# అవినీతిపరులను బోను ఎక్కించాల్సిందే !

కేంద్రంలో ఎన్‌డిఎ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పడబోతోంది. ఎపిలో కూడా చంద్రబాబు నాయుడు మరోమారు అధికార పగ్గాలు చేపట్టబోతున్నారు. ఈ క్రమంలో ఎన్‌డిఎ ప్రభుత్వం గతం కన్నా మిన్నగా పనితీరు ప్రదర్శించాల్సి ఉంది. ప్రజల సమస్యలపై తటణం స్పందించాలి. దేశాభివృద్ధికి రూట్‌మ్యాప్‌ సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రాలను అభివృద్ధి చేసే క్రమంలో పార్టీలకు అతీతంగా నడుచుకోవాలి. అలాగే అధికారం అడ్డం పెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడి, రాష్ట్రాలను దివాళా తీయించిన నిరంకుశ నేతలను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టి చర్యలు తీసుకోవాల్సిందే. ఈ క్రమంలో ఎపిలో జగన్‌, తెలంగాణలో కెసిఆర్‌ అవినీతి అక్రమాస్తుల కేసులు మళ్లీ ముందుకు రానున్నాయి. జగన్‌ ఇప్పటికే బెయిల్‌పై ఉంటూ రాజ్య మేలారు. అలాగే అనేక అవినీతి కేసుల్లో పీకల్లోతు వరకు మునిగారు. వీటిని తవ్వి తీయడానికి అధికారంలోకి వచ్చే తెలుగుదేశం తప్పకుండా ప్రయత్నం చేస్తుంది. ఇక్కడ తెలంగాణలో కూడా కెసిఆర్‌ ఫోన్‌ట్యాపింగ్‌ ప్రకంపనలు సృష్టిస్తోంది. మరోవైపు ఒక్కటంటే ఒక్క ఎంపి సీటు గెలవకపోవడంతో బిఆర్‌ఎస్‌ ప్రభ పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో బిఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు కూడా ఉంటారో..జారుకుంటారో తెలియని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఓటమి పాలయిన మాజీ ముఖ్యమంత్రులకు కేసులను ఎదుర్కోక తప్పని పరిస్థితి రాబోతున్నది. మొన్నటి వరకు ఎన్నికల కోడ్‌ కారణంగా కొంత స్తబ్దత ఏర్పడింది. జగన్‌ కూడా అధికారంలో ఉండగా విచ్చలవిడిగా అధికార దుర్వినయోగానికి పాల్పడ్డారు. చంద్రబాబును, ఆయన అనుచరులను వేటాడి వెంటాడారు. ఇవన్నీ చూస్తూ ఊరుకునే కేసులు కావు. ప్రధానంగా ఇసుక, మట్టి మాఫియాలు దోచుకున్నాయి. అలాగే మద్యపాన నిషేధం చేయకపోగా లోకల్‌ బ్రాండ్లతో వేలకోట్లు దొచారు. వీటన్నటిపైనా టిడిపి శ్రేణులు గత ఐదేళ్లుగా పోరాడుతున్నారు. అనేక కేసులు ఎదుర్కొన్నారు. ఇలాంటి వాటిని చూస్తూ ఊరుకుంటారనడానికి లేదు. అనేక రంగాల్లో అవతవకలు జరిగాయి. భూ ఆక్రమణలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అన్నింటికి మించి వివేకానందరెడ్డి మర్డర్‌ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు సక్రమంగా సాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేంద్రంలో ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఏర్పడ్డా ఎన్‌డిఎ భాగస్వాములకు ప్రాధాన్యం పెరిగింది. చంద్రబాబుకు కూడా ప్రాధాన్యం మరింతగా పెరిగినట్లే . ఈక్రమంలో అనేక అవినీతి కేసుల్లో చరంద్రబాబు చూస్తూ ఊరుకుంటారనడానికి లేదు. కేంద్రంపై ఒత్తడి తెచ్చికేసుల దర్యాప్తులో వేగం పెంచే అవకాశం ఉంది. అలాగే ఎన్‌డిఎ ప్రభుత్వంలో చేరితే తెలుగుదేశం పార్టీ కీలకమైన మంత్రి పదవులను పట్టుబట్టి తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో కేంద్రంలో కీలకంగా ఉంటారు. ఇకపోతే తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి ఉంది. బిజెపి ప్రధాన కార్యదర్శి బిఎల్‌ సంతోష్‌ను ఇరికించే ప్రయత్నం చేశారన్న విషయంలో బిజెపి ఊరుంటుందనడానికి లేదు. ఇప్పుడు బిఆర్‌ఎస్‌తో అంటకాగాల్సిన అవసరం కూడా బిజెపికి లేదు. వందల మంది ఫోన్లను ట్యాప్‌ చేయించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ చివరకు రాజకీయంగా అతఃపాతాళానికి తొక్కివేయబడ్డారు. రాజకీయంగా ఇప్పటికప్పుడు చక్రం తిప్పేది లేదు. మరో ఐదేళ్ల వరకు రాజకీయాలు ఎలా ఉంటాయో తెలియదు. అప్పటి వరకు బిఆర్‌ఎస్‌ నిలదొక్కుకునేది కూడా కష్టమే. ఉన్న ఎమ్మెల్యేలు కూడా అంటిపెట్టుకుని ఉంటారని కూడా లేదు. ఈ క్రమంలో కేసుల్లో ఇరుక్కోకుండా ఉండేందుకు సాయం చేసేవారు కూడా లేదు. సొంత మనుషులను పరాయివాళ్లలా అనుమానించి దూరం చేసుకున్నారు. ఉద్యమం నాడు వెన్నంటి నడిచిన వారెవరూ ఆయన వెంటలేరు. ఇప్పుడు ఆయనే ఒంటరి అయ్యారు. పార్లమెంట్‌ ఎన్నికలతో పార్టీ మొత్తంగా దెబ్బతింది. ఒక్కటంటే ఒక్క ఎంపి సీటు గెలవకపోవడం, డిపాజిట్లు కూడా దక్కకపోవడంతో ప్రజల్లో ఉన్న ఆదరణ కూడా పోయింది. అధికారమంటే బాధ్యత అనే విషయం విస్మరించి, తమకు ప్రత్యర్థులే ఉండకూడదన్న ధోరణితో వ్యవహరించడం వల్లనే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి దాపురించింది. కేసీఆర్‌ తరహాలో అధికారంతో విర్రవీగిన వారికి ఈ తరహా పతనమే తప్పదని జగన్‌ కూడా రుజువు చేశారు. కేంద్రంలో మోడీ కూడా ఇదే తరహాలో అధికార ఆధిపత్యం చెలాచించినా..గుడ్డిలో మెల్లలా కూటమితో బయటపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించరాదని మోడీ, జగన్‌, కెసిఆర్‌ ల ఉదాహరణలు చెప్పుకోవాలి. బలమైన నాయకులను పక్కన పెట్టుకోగూడదని కోరుకుంటారు. ప్రాంతీయ పార్టీలలో ఈ ధోరణి అధికంగా ఉంటుంది. కేసీఆర్‌,జగన్‌ కూడా ఇదే మార్గంలో పయనించి ఇప్పుడు అధికారం కోల్పోయారు. తెలంగాణ ఉద్యమంతో మమేకమై పార్టీని నమ్ముకొని ఉన్నవాళ్లను కాదని ప్రజాబలం లేని వాళ్లను, తనకు వంత పాడే వాళ్లను కేసీఆర్‌ తన చుట్టూ నింపుకొన్నారు. ఫలితంగా బలమైన నాయకులు దూరమయ్యారు. ప్రజాబలం లేకపోయినా కేసీఆర్‌ మనసెరిగి వ్యవహరించడం ద్వారా లాభపడుతూ వచ్చిన వాళ్లు ఇప్పుడు ఒక్కొక్కరుగా ఆయనను విడిచి వెళ్లిపోయారు. ఎన్‌డిఎ పక్షాలకు ఇంకా కొంచె ఎక్కువ సీట్లు వచ్చి, బిజెపికి తక్కువ సీట్లు వచ్చివుంటే మోడీ పరిస్థితి కూడా రివర్స్‌ అయ్యేది. కానీ అదృష్టంకొద్దీ మోడీ బయట పడ్డారు. మోడీ కూడా తన విధానాలను సమీక్షించుకోవాలి. ప్రజలు మెచ్చే పాలన అందించే ప్రయత్నం చేయాలి. ప్రజలు పడుతున్న బాధలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పనిచేయాలి. ఎన్‌డిఎ పక్షాలు ఇప్పుడు కీలక భూమిక పోషించాలి. రాష్ట్రాల్లో విచ్చలవిడిగా వ్యవహరించి, అప్పుల కుప్ప చేసిన రాష్ట్రాలను గాడిలో పెట్టాలి. రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్రాలు కలసి పనిచేయాలి. ప్రజలకు అవసరమైన పనుల విషయాలో రాజకీయాలను పక్కన పెట్టాలి. ఉమ్మడి ఎజెండాకు అనుగుణంగా, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగాలి. అలాగే అవినీతికి పాల్పడ్డ నేతలను బజారులో నిలబెట్టాల్సిందే. అవినీతి, అధికార దుర్వినియోగం చేసిన వారిని ఉపేక్షించరాదు.

కెసిఆర్‌ లేదా, జగన్‌లు ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని లేచి నిలబడే ప్రయత్నం చేస్తే భవిష్యత్తు ఉండవచ్చు. కానీ వారి వ్యవహార శైలి మార్చుకోకపోతే ప్రయోజనం ఉండదు. ప్రాంతీయ వాదంతో కేసీఆర్‌ ఇంత కాలం రాజకీయాల్లో రాణించారు. కానీ సెంటిమెంట్‌తో ఇక రాజకీయాలు చేయడం సాధ్యం కాదు. అధికారంలో ఉన్నప్పుడు మీడియాను భయపెట్టి లొంగదీసుకున్నారు. మీడియాను కూడా దూరం చేసుకోవడంతో వారు కూడా కెసిఆర్‌కు దూరం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పీఎస్సార్‌ ఆంజనేయులు, రఘురామి రెడ్డి, రవిశంకర్‌ రెడ్డి, రిషాంత్‌ రెడ్డి వంటి వాళ్లు అన్ని రకాల పరిధులను అతిక్రమించి వ్యవహరించినట్టు వార్తలు వస్తున్నాయి. హద్దులు దాటి ప్రవర్తించే అధికారులు ఎప్పటికైనా మూల్యం చెల్లించుకోవలసిందే!

# ఇకపై సింగరేణిలో పాలన పరుగులు పెట్టాలి

ఆలోచనా విధానాలను మార్చుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సింగరేణి వ్యాపార విస్తరణకు మంచి అవకాశాలున్నాయని.. అధికారులు, ఉద్యోగులందరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా, సమయానుకూలంగా నిర్వహించగలిగితే సంస్థను దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టవచ్చున్నారు. పని గంటల వినియోగంతో పాటు మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం చాలా ముఖ్యం అని అన్నారు.విధి నిర్వహణలో అలసత్వం వహిస్తూ లక్ష్యసాధనలో నిర్లక్ష్యం చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రతినెలా ఆయా శాఖల పనితీరులో మెరుగుదల కనిపించకపోయినా.. అప్పగించిన పనులు పూర్తి చేయకుంటే కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. అదే సమయంలో సంస్థ పట్ల అంకితభావంతో పనిచేసిన వారికి మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

ఈ సందర్భంగా యాజమాన్యం ఉత్పత్తితో పాటు సంక్షేమం, రక్షణ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఖర్చులో రాజీపడకుండా రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు గుర్తు చేశారు. కంపెనీ అభివృద్ధికి మంచి సూచనలను స్వీకరించడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో రక్షణ, సంక్షేమం, వైద్యం, మెటీరియల్‌ ప్రొక్యూర్‌మెంట్‌, మార్కెటింగ్‌, ఫైనాన్స్‌, ఎక్స్‌ప్లోరేషన్‌, ఎస్టేట్స్‌, విజిలెన్స్‌ తదితర 32 శాఖల పనితీరును క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో డైరెక్టర్‌ ఆపరేషన్‌ అండ్‌ పర్సనల్‌ ఎన్‌వికె శ్రీనివాస్‌, ఇఅండ్‌ ఎం డైరెక్టర్‌ డి.సత్యనారాయణరావు, జిఎం(కోఆర్డినేషన్‌) జి.దేవేందర్‌, కార్పొరేట్‌లోని వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్‌..!

న్యూఢిల్లీ, జూన్‌ 06: తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి బలం పుంజుకుంది. అంతేకాదు కొన్ని ప్రాంతాల్లో బీజేపీకి సైతం గట్టి పోటీ ఇచ్చింది. ఇక ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ 99 స్థానాలకు గెలుచుకుంది. దీంతో లోక్‌సభలో ఆ పార్టీ ప్రతిపక్ష హోదా లభించినట్లు అయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేత రాహుల్‌ గాంధీ ఆ పదవి చేపట్టాలంటూ ఆ పార్టీలోని నేతలు ఎక్స్‌ వేదికగా అభిప్రాయపడుతున్నారు. ఆ క్రమంలో వారి అభిప్రాయాలు.. కాంగ్రెస్‌ సీనియర్‌ నేత కార్తీ చిదంబరం స్పందించారు. 'కాంగ్రెస్‌ పార్టీకే ఆ స్లాట్‌ వస్తుందని భావిస్తున్నానన్నారు. తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం రాహుల్‌ గాంధీ ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలని ఆయన తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఇక కాంగ్రెస్‌ పార్టీ ఎంపీ మాణిక్కం ఠాగూర్‌ స్పందిస్తూ.. లోక్‌సభలో రాహుల్‌ గాంధీ తమ నాయకుడిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఎన్నికల్లో ప్రజల మధ్యకు వెళ్లి రాహుల్‌ గాంధీ పేరు చెప్పి ఓట్లు అడిగానన్నారు. తమ పార్టీ నుంచి ఎన్నికైన సభ్యులంతా ఇదే విధంగా కోరుకుంటారన్నారు. అయితే తమది ప్రజాస్వామిక పార్టీ అని ఆయన ఈ సందర్భంగా అభివర్ణించారు.

# తెలంగాణపై బిజెపి ప్రత్యేక ఫోకస్‌

## కెసిఆర్‌ అవినీతి, అక్రమాలపైనా దృష్టి
## అధికారం లక్ష్యంగా బిజెపి ప్లాన్‌

హైదరాబాద్‌,జూన్‌6: బిజెపి తెలంగాణ రాజకీయాలపై గట్టిగానే ఫోకస్‌ పెట్టనుంది. బిఆర్‌ఎస్‌ కనుమరుగు కావడంతో ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసేందుకు కసరుత చేసే అవకాశం ఉంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కొంత బలం చాటిన బిజెపి ఇప్పుడు ఎంపి ఎన్నికలతో మరింత బలోపేతంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇక్కడ గెలిచిన 8మంది ఎంపిల్లో మరోమారు ఒకరిద్దరికి మంత్రి పదవులు దక్కే ఛాన్స్‌ ఉంది. కిషన్‌రెడ్డి గత మంత్రివర్గంలో ఉన్నారు. ఇప్పుడు ఆయనకు ఇస్తారా లేక మరెవరికైనా ఇస్తారా అన్నది చూడాలి. మరోవైపు కెసిఆర్‌ అవినీతిపై చర్యలు తీసుకోవాలన్న పట్టుదల కాంగ్రెస్‌ , బిజెపి నేతల్లో కనిపిస్తోంది. ప్రభుత్వ ఏజెన్సీలు కూడా కేసీఆర్‌పై నిఘా పెట్టాయని బిజెపి పరోక్షంగా హెచ్చరికలు చేస్తోంది. ఎన్నికలకు ముందు కేసీఆర్‌ చుట్టూ కేంద్ర పెద్దలు ఉచ్చు బిగిస్తున్నట్లు ప్రచారం చేశారు.

ఇంతకాలం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ వంటి సంస్థలు ఏ క్షణంలోనైనా రంగంలోకి దిగవచ్చుని లీకులు ఇచ్చారు. నీటిపారుదల శాఖకు చెందిన అనుచిత చెల్లింపులకు సంబంధించి నిర్దుష్టమైన ఆధారాలు కేంద్ర ప్రభుత్వ వద్ద ఉన్నాయిన బిజెపి నేతలు బాహాటంగగానే చెబుతున్నారు. జైలుకు పంపుతామని పదేపదే చెబుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ విషయం ఎలా ఉన్నప్పటికీ తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ పట్టుదల ఇప్పుడు మరింతగా పెరిగింది. తమ బలం పెరిగిందన్న ధీమాలో ఉన్నారు. కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయం అని చెబుతున్నారు. ఇకపోతే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ పేర్కొన్నారు. సాధారణ కార్యకర్త సైతం అత్యున్నత పదవిని అందుకోవడం బీజేపీలోనే జరుగుతుందని




చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందని అంటున్నారు. బీజేపీకి కులం, మత భేదాల్లేవని.. పేదరికమే ప్రాథమికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని వెల్లడించారు. ప్రజాధనాన్ని తన కోసం కేసీఆర్‌ దుబారా చేయడాన్ని ప్రజలు సహించలేదని, అందుకే ఎన్నికల్లో ఓడించారని అన్నారు.

# టీడీపీ దాడులతో ఏపీలో భయానక వాతావరణం

ఉన్న శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర గవర్నర్‌ వెంటనే జోక్యం చేసుకుని పచ్చమూకల అరాచకాలను అడ్డుకోవాలని, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ, సోషల్‌ మీడియా సైనికులకు తోడుగా ఉంటాం' అని జగన్‌ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.కాగా, మంగళవారం వెలువడిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో జగన్‌ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. 175 అసెంబ్లీ స్థానాలకు కేవలం 11 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఇక తెలుగుదేశం పార్టీ 135 స్థానాల్లో అఖండ విజయంతో అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం %-% జనసేన %-% బీజేపీ కూటమి ఏకంగా 164 స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో ఓటమిని అంగీకరిస్తూ జగన్‌ సీఎం పదవికి రాజీనామా చేసేశారు. ఇక ఈనెల 12న రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది.

# గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

## వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్‌ పి గౌతమి
## - పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్‌ వస్తువులను అనుమతించవద్దు
## - వీడియో కాన్ఫరెన్స్‌లో టీజీపీఎస్సీ చైర్మన్‌ మహేందర్‌రెడ్డి


సిరిసిల్ల : గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షలను ఈ నెల 9న పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడంతోపాటు పరీక్ష కేంద్రాలకు ఎలాంటి ఎలక్ట్రానిక్‌ పరికరాలను అనుమతించవద్దని అలాగే అభ్యర్థులు ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను సందర్శించాలని తెలంగాణ పబ్లిక్‌ కమిషన్‌ చైర్మన్‌ మహేందర్‌రెడ్డి అదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జరిగిన వీడియోకాన్సరేన్స్‌లో హైదరాబాద్‌నుంచి టీజీపీఎస్సీ చైర్మన్‌ మహేందర్‌రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌ పూజారి గౌతమితోపాటు సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అదివారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే గూప్‌-1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు గట్టి బందోబస్తును ఏర్పాటుచేయాలన్నారు. టీజీపీఎస్సీ నుంచి వచ్చే పరీక్ష పత్రాలు, ఓఎంర్‌ షీట్లును జాగ్రత్తగా భద్రపర్చాలని, కేంద్రం వద్ద సీసీ కెమారాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష విధులు నిర్వర్తించే అబ్జర్వర్‌, రూట్‌ అఫీసర్స్‌, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ , ఇన్విజిలేటర్లు ఇతర సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మహిళలు, పురుషులకు వేరువేరుగా తనిఖీలను నిర్వహించేందుకు గదులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయడంతోపాటు పరిసర ప్రాంతాల్లో జిరాక్స్‌ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నా రు. అర్టీసీ అ?ధికారులు అభ్యర్థులకు అనుగుణంగా బస్సులను నడిపించా లని, సెస్‌ అధికారులు విద్యుత్‌ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఫ జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలు

జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో 4,699 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అభ్యర్థు?లకు అనుగుణంగా పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్‌ పూజారి గౌతమి తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్‌ రూం 9398684240 నంబర్‌కు ఫోన్‌ చేయాలని కోరారు. అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రంవద్ద తాగునీరుతోపాటు మరుగుదొడ్లను సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఫ ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

గ్రూప్‌ -1 పరీక్షలను రాసే అభ్యర్థులు ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను చూసుకోవాలని కోరారు. పరీక్ష జరిగే రోజు ఉదయం 9గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పదిగంటల తరువాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతులు ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్‌ ఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో డాక్టర్‌ వడ్డూరి శ్రీనివాస్‌, పర్యవేక్షకులు వేణు తదితరులు పాల్గొన్నారు.



# ఓటు బ్యాంక్‌ తారుమారు

## గణనీయంగా తగ్గిన బీఆర్‌ఎస్‌ ఓట్లు
## మెజార్టీలున్నా కాంగ్రెసకూ తగ్గిన ఓట్లు
## బీజేపీనీ వెంటాడిన సమన్వయలోపం
## మూడు పార్టీల్లోనూ భిన్నమైన విశ్లేషణలు

నల్గొండ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ఉమ్మడి జిల్లాలో ప్రధాన పార్టీల్లో ఆసక్తికర విశ్లేషణలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు ప్రధాన పార్టీల ఓట్లకు గణనీయమైన గండి పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ద్వితీయస్థానంలో కొనసాగిన బీఆర్‌ఎస్‌ ఎంపీ ఎన్నికలకు వచ్చేసరికి సగానికిపైగా ఓటు బ్యాంకును కోల్పోయింది. బీజేపీ ఓటు బ్యాంకు అనూహ్యంగా పెరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థులకు భారీగా మెజార్టీలు నమోదైనా, రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ ఓటింగ్‌ తగ్గింది.

ఉమ్మడి జిల్లాలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్‌ నియోజకవర్గంతో పాటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే జగదీషరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సూర్యాపేట నియోజకవర్గంలో మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్‌ ఓటింగ్‌ తగ్గింది. ఈ తగ్గుదల కోదాడ, నల్లగొండల్లో స్వల్పంగా ఉండగా, మిగిలిన చోట్ల భారీగా ఉంది. నల్లగొండ లోక్‌సభ స్థానంలో అనూహ్యంగా ద్వితీయ స్థానంలోకి వచ్చిన బీజేపీకి ఆ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సొంత నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్‌ కంటే తక్కువ ఓట్లు రాగా, సూర్యాపేట నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే తక్కువ ఓట్లు ఈ ఎన్నికల్లో నమోదయ్యాయి. ఇలా పలు భిన్నమైన ఫలితాలు ఈ ఎన్నికల్లో వెలువడడంతో భవిష్యత్‌ రాజకీయం ఎలా ఉండనుందనేది ఆసక్తికరంగా మారింది.

బీఆర్‌ఎస్‌ ఓటు బ్యాంక్‌ తగ్గింది

ఉమ్మడి జిల్లాలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ఒక అసెంబ్లీ స్థానాన్ని గెలవగా, మిగిలిన అన్ని చోట్లా ద్వితీయ స్థానంలో ఉంది. నల్లగొండ లోక్‌సభ పరిధిలో ఏడింట ఆరుచోట్ల ద్వితీయ స్థానంలో, సూర్యాపేటలో మొదటి స్థానంలో ఉన్న పార్టీ 33.13 శాతం ఓటు బ్యాంక్‌ సాధించింది. భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఏడు సీట్లలోనూ ఆరింటిలో ద్వితీయ స్థానంలో ఉండి, 4,78,631 ఓట్లతో 36.39శాతం ఓట్‌ బ్యాంక్‌ను నిలబెట్టుకుంది. అయితే లోక్‌సభకు వచ్చేసరికి ఆ పార్టీ ఓట్‌ బ్యాంక్‌ పూర్తిగా పడిపోయింది. 2,18,417 ఓట్లతో 17.10శాతానికే పరిమితమైంది. భువ నగిరి లోక్‌సభ స్థానంలో ఏడు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో 5,60,002 ఓట్లతో 36.39శాతం ఓటింగ్‌ను సాధించగా, లోక్‌సభకు వచ్చేసరికి 2,56,187 ఓట్లతో 18.45శాతానికి ఓట్‌ బ్యాంక్‌ పడిపోయింది. బీఆర్‌ఎసకు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసిన వర్గాల్లో యువత, విద్యార్థులతో పాటు, హిందూత్వ భావజాలం ఉన్నవారు, కుల ప్రాతిపదికన కొందరు ఓటర్లు బీజేపీకి మళ్లడంతో పాటు, బీఆర్‌ఎస్‌ తరుపున సాగిన ప్రచారం కూడా ఆకట్టుకోలేకపోవడం, అభ్యర్థుల ప్రాధాన్యం అంతగా కనిపించకపోవడం, పార్టీ శ్రేణులను ఏకతాటిపై నడపడంలో నాయకత్వం పట్టింపులేకుండా వ్యవహరించడం వంటి అంశాలు ఈ ఓట్‌ బ్యాంక్‌ తగ్గుదలకు కారణమయ్యాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

బీజేపీలో సమన్వయలోపం

ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ రెండో స్థానంలోకి దూసుకువచ్చింది. నల్లగొండ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో 5.08శాతం ఓట్‌ బ్యాంక్‌ సాధిస్తే, ఎంపీ ఎన్నికల్లో 17.57శాతం ఓట్లు సాధించింది. బీఆర్‌ఎస్‌కంటే అరశాతం అధికంగా ఓట్లను రాబట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్లు వచ్చిన నల్లగొండ (7,828), మిర్యాలగూడ (3,024) స్థానాల్లో ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎసను మించి ఓట్లు సాధించింది. నల్లగొండలో 51,451ఓట్లు వస్తే, మిర్యాలగూడలో 36,511ఓట్లు వచ్చాయి. సూర్యాపేటలో మాత్రం అసెంబ్లీ కంటే ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ ఎన్నికల్లో 40,407 ఓట్లు వస్తే, ఎంపీ ఎన్నికల్లో 32,615 ఓట్లే వచ్చాయి. పార్టీకి బలమైన నాయకత్వం, మొదటి నుంచి ఓట్‌ బ్యాంక్‌ ఉన్న నియోజకవర్గమైనా, నాయకత్వానికి, అభ్యర్థికి మధ్య ఉన్న గ్యాపే ఓటింగ్‌ తగ్గుదలకు కారణంగా చెబుతున్నారు. అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో మాత్రం బీజేపీ మూడో స్థానంతోనే సరిపుచ్చుకుంది. ఇక్కడ బీఆర్‌ఎస్‌ రెండోస్థానంలో నిలిచి 27,781 ఓట్లు సాధిస్తే, బీజేపీకి 21,777 ఓట్లు వచ్చాయి. అభ్యర్థి, పార్టీ క్యాడర్‌, పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కుదిరితే సూర్యాపట జిల్లాలోనూ మరిన్ని ఓట్లు పెరిగేవని, భువనగిరి తరహాలో అన్ని నియోజకవర్గాల్లో ద్వితీయ స్థానంలో ఉండేవాళ్లమని పార్టీ నేతలు చెబుతున్నారు.

రెండు చోట్ల మాత్రమే పెరిగిన కాంగ్రెస ఓటింగ్‌

అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోల్చుకుంటే, లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో హుజూర్‌నగర్‌, సూర్యాపేట మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ ఓట్లకు గండి పడింది. హుజూర్‌నగర్‌ నియోజకవర్గంలో మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో 1,16,707 ఓట్లు వస్తే, ఎంపీ ఎన్నికల్లో 1,33,200 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ కంటే 16,493 ఓట్లు అధికంగా వచ్చాయి. అదేవిధంగా సూర్యాపేట నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ ద్వితీయ స్థానంతో సరిపుచ్చుకొని 70,537 ఓట్లకు పరిమితమైతే, ఈ ఎన్నికల్లో పార్టీ ఏకతాటిపై నడవడం, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్‌ చైర్మన్‌ పటేల్‌ రమేషరెడ్డి వర్గవిభేదాలు వీడి పనిచేయడంతో ఈ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ కంటే ఆధిక్యత సాధించింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల కంటే 32,736 ఓట్లు అదనంగా ఈ నియోజకవర్గంలో సాధించింది.

అధికారపార్టీకి 10చోట్ల తగ్గిన ఓటింగ్‌

నల్లగొండ లోక్‌సభ పరిధిలో 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత శాసనసభ ఎన్నికల కంటే ఎంపీ ఎన్నికల్లో తక్కువ ఓట్లు వచ్చాయి. మిర్యాలగూడలో 14,972 ఓట్లు కాంగ్రెసకు తగ్గాయి. నాగార్జునసాగర్‌లో 12,739 ఓట్లు, దేవరకొండలో 11,265 ఓట్లు, నల్లగొండలో 2,775 ఓట్లు, కోదాడలో 1,283 ఓట్లు అధికార పార్టీ అభ్యర్థికి తగ్గాయి. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా కనిపించింది. ఆలేరు నియోజకవర్గంలో అసెంబ్లీ కంటే 45,410 ఓట్లు తగ్గాయి. నకిరేకల్‌ నియోజకవర్గంలో 36,626 ఓట్లు, తుంగతుర్తిలో 26,448 ఓట్లు, భువనగిరిలో 28,423 ఓట్లు కాంగ్రెస్‌ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి తగ్గాయి. మునుగోడు అసెంబ్లీలోనూ 10,957 ఓట్ల తగ్గుదల కనిపించింది. భువనగిరి లోక్‌సభ పరిధిలోకి వచ్చే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 38,493 ఓట్లు తగ్గగా, జనగామలోనూ స్వల్పంగా 7,160 ఓట్లు తగ్గాయి. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఊపు ఈ ఎన్నికలకు తగ్గిందని, ఇదే తగ్గుదల కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ప్రతిపక్షాలకు అవకాశమిచ్చినట్లు అవుతుందని, ఈ తగ్గుదలపైనా అధిష్ఠానం సమీక్ష నిర్వహించాలని అధికార పార్టీ నేతల్లో చర్చ సాగుతోంది. అయితే కాంగ్రెస్‌ వ్యతిరేక ఓట్లలో బీజేపీ, బీఆర్‌ఎసకు చీలాయని, కాంగ్రెసకు మంచి మెజార్టీ కనిపించినా, ప్రతిపక్షంగా ఒకే పార్టీకి ఓటర్లు మొగ్గితే మెజార్టీల్లోనూ గణనీయమైన తగ్గుదల కనిపించేదని, ఈ అంశాలను పార్టీ అగ్రనేతలు పరిశీలించాలని క్యాడర్‌లో చర్చ సాగుతోంది. మరి అధిష్ఠానం దీనిపై చర్చించి స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ ఓట్లు చీలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సిందే.

# విజయాలకు ఫుల్‌స్టాప్‌లు ఉండవు

### ఫోకస్‌గా ఉంటే గెలుపు అసాధ్యం కాధు.
### నిరంతర కృషితో సాధించ వచ్చు.
### యువత పవన్ ను ఆదర్శంగా తీసుకోవాలి.



**సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా),06 జూన్,అక్షరం న్యూస్.**
(మహమ్మద్ యూసుఫ్ అలీ)

రాజకీయ క్షేత్రంలో ఒక్కడి'గా అడుగు పెట్టిన పవన్ పది సంవత్సరాల నిరంతర కృషి,ఎన్నో అవమానాలు,ఎన్నో ఇబ్బంధులు ఎదుర్కొని నిలబడి, తన సత్తా ఈ ఎన్నిల్లో చాటుకున్నారు. పవన్ రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఏదో మార్పు జరుగుతుందని అందరూ ఊహించారు.కానీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వచ్చిన రిజల్ట్స్ తో జనసేన' కూడ ప్రజా రాజ్యం లా చరిత్ర లో కలిసి పోతుందని అనుకున్నారు, మొదటి దశ లో పవన్ సభల కు జనం లక్షలాది గా తరలి వచ్చారు కానీ, ఓట్లు మాత్రం వేయలేధు.అయినా పవన్ వెనుకడుగు వేయలేదు,అదే ధైర్యం తో నిలబడి ఎదుర్కొన్నారు. 2014లో తెదేపాకు మద్దతు పలికిన పవన్ కల్యాణ్. 2019కి వచ్చేసరికి సైద్ధాంతిక విభేదాలతో తెదేపాకు దూరం జరిగారు. ఆ ఎన్నికల్లో వామపక్షాల, బీఎస్పీతో కలిసి పోరాటానికి దిగారు.ఒక్కడిగా రాష్ట్ర రాజకీయాల్లో నిలదొక్కుకోవడం ఎంత కష్టమో తెలిసి కూడ, వెనకడుగు వేయలేధు.స్వంతంగా పోటీ చేసిన రెండు సీట్లు కూడ ఒడి పోవడం,తమ పార్టీ నుంచి గెలిచిన ఏకైక వ్యక్తి కూడ అధికార పార్టీలోకి జంప్ అయినా ఏమి పట్టించుకోలేదు, రేయింబవళ్లు కేవలం జన సేన పార్టీ ను ఎలా విస్తరించాలో,గ్రామ స్థాయి నుంచి ఎలా పటిష్ట పర్చాలో పని చేస్తూ వచ్చారు. ఒకానొక సమయం లో పవన్ ను నిలకడ లేని,నాయకుడి గా విమర్శిచారు.అయినా పవన్ ఇవేమీ పట్టించు కోలేదు. కేవలం పార్టీ పటిష్టత పైనే ఫోకస్ పెట్టారు. పవన్ గెలిచినవి కొన్ని సీట్లే అయినా,అదొక పెద్ద గెలుపు గా చూడబడుతుంది. పది సంవత్సరాల నిరంతర కృషి,కష్టానికి ఫలితంగా తనకంటూ ఓ స్థానం సాధించ గలిగారు. కొన్నిసార్లు రావడం లేటు అవ్వొచ్చేమో గానీ, రావడం మాత్రం పక్కా అనే పవన్ కల్యాణ్ డైలాగ్ ఇప్పుడు నిజం అయ్యింది,అసెంబ్లి లోకి వెళ్ళడం కోసం పది సంవత్సరాలు ఆలస్యం అయినా చివరికి వెళ్ళడం లో సఫలమయ్యారు, అది కూడ తన బలగం తో.ఓ వ్యక్తి గా కాకుండా ఓ శక్తి గా అస్సెంబ్లీ లో అడుగు పెట్ట బోతున్నారు.ప్రజా రాజ్యం కాంగ్రెస్ లో విలీనం చేయడం లో చిరంజీవి చేసిన తప్పు పవన్ ను చాలా హార్ట్ చేసింది,ఎవరి నిర్ణయాల కింద పని చేయడం కంటే, స్వయం నిర్ణయాధికారం ఉండే దారి ఎంచుకున్నారు.ఫలితంగా జన సేన ఆవిర్భావం.ఆ తర్వాత ఆంధ్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి.పవన్ సభలకు వచ్చేజనాన్ని చూసి మొదటి దశ లోనే రాష్ట్ర రాజకీయాల్లో మార్పు వస్తుందని ఊహించారు, కానీ ఫలితాలు మాత్రం శాకిచ్చాయి.అక్కడి నుంచి పవన్ కళ్యాణ్ అసలు కష్టాలు మొదలయ్యాయి.తెలుగుదేశం లాంటి బలమైన పార్టీ, నాయుడు లాంటి రాజకీయ భీష్మాచార్యుని ఎదుర్కోవడం, మరో వైపు, వై.ఎస్.ఆర్.కుమారుడిగా జగన్ తనకంటూ ఓ ప్రత్యేకత తో రాజకీయాల్లో దూసుకు పోతున్న సమయం లో జనసేన ఆవిర్భావం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు,ఎదురైన సంఘటనలను తట్టుకుని నిలబడేందుకు పవన్ కున్న సహనం, తన గమ్యం గురించిన ఫోకస్,మాత్రమే నిలబెట్టింది.రెండు సార్లు ఓడిన తర్వాత సాధారణంగా ఏ రాజకీయ నాయకుడికైనా ఒక విధమైన నిర్లిప్తత ఆవరిస్తుంది.పార్టీ ను అంటీ పెట్టుకున్న వారు కూడ దారులు వెధుక్కునే పని లో ఉంటారు. కానీ పవన్ పార్టీ శ్రేణులు మనోధైర్యం కోల్పోకుండా చేశారు.వారితో మమేకమవుతూ వారి లో ఒకడిగా మేదిలారు. ప్రజా సమస్యల పై పోరాడుతూ నాకు పూల దండాలు, పుదీనా దండలు వేయకండి, ఓట్లు వేయండి అంటూ జనాలను అడిగిన సంధార్భాలు కొందరికి మాత్రమే అర్థం అయ్యాయి. తన గమ్యం గురించి పవన్ ఎంత ఫోకస్ గా ఉన్నారో ఈ వాక్యలే అద్ధం పడుతాయి.గత ప్రభుత్వం అధికార గర్వం తో ప్రజలను విస్మరించిన చోటే పవన్ నేనున్నా అంటూ ఆధుకున్నారు. ఈ పరిస్తితుల్లో ప్రజల అభీమానానికి జన సేనాని దగ్గరయ్యాడు.అక్కడి నుంచి మార్పు మొదలయ్యింది.ఆ తర్వాత అనుకోని పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్ళడం. కష్ట కాలంలో మిత్రుడి గా నేనున్నా అంటూ, చంద్ర బాబు కుటుంభానికి తోడుగా పవన్ నిలబడటం రాష్ట్ర ప్రజల్ని ఎంతగానో ఆకర్షించింది.అక్కడి నుంచి పాలక పార్టీ తో చేసిన పోరాటం ఫలించి, సఫలీకృత నాయకుడిగా పవన్ కళ్యాణ్ అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.విజయాలకు ఫుల్ స్టాప్ లు ఉండవు, కేవలం కామా'లు మాత్రమే ఉంటాయి.ఆంధ్ర రాష్ట్ర రాజకీయాల్లో పవన్ ప్రత్యేకంగా నిలుస్తారని, మేధావి వర్గం విశ్లేషిస్తుంది.

# రాజన్న ఆలయ అవినీతి సిబ్బందికి చెక్....!

### రాజన్న ఆలయం లో పనిచేసే ఉద్యోగులు శాశ్వతంగా ఇక్కడేనా వారికి బదిలీలు లేవా?

### స్వామివారి లడ్డు ప్రసాదం ధర ఎక్కువ... బరువు తక్కువ... భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్న ఆలయ అధికారులు.






**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, జూన్ - 06 (అక్షరం న్యూస్):**
దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని ఆయా విభాగాల్లో అక్రమాల పరంపర కొనసాగుతుందని గత కొద్దిరోజులుగా జోరుగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వ ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు పలుమార్లు ఆలయంలోని ప్రధాన విభాగాలలో తనిఖీలు నిర్వహించి, పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. అయితే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సిన గత ప్రభుత్వ పెద్దలు అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో మాత్రం విఫలమయ్యారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో గత ప్రభుత్వం చేయలేని పనిని, వారు చేసిన తప్పిదాలను మరల చేయకుండా ఉండాలని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు చేపట్టనుందని, ముఖ్యంగా ఆలయంలో పెద్ద ఎత్తున ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను, సిబ్బందిని బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. దీనికి తోడు భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడి విజిలెన్స్ తనిఖీల్లో అడ్డంగా దొరికినప్పటికీ అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతో బ్రతికిపోయిన అధికారులను, సిబ్బందిని వదిలేది లేదని, అలాంటి వారిని ప్రత్యేక కేటగిరీ కింద జత కట్టి, రాజన్న ఆలయం నుండి ఇతర ఆలయాల్లోకి బదిలీ చేయడం లేదంటే, విచారణలో గనక లెక్కకు మించి తప్పిదాలు చేసినట్లు గుర్తిస్తే అలాంటి వారిని సస్పెన్షన్ కు గురి చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఇక ఇవన్నీ ఇలా ఉంటే రాజన్న ఆలయంలో కొంతమంది అధికారుల ఆగడాలకు అంతులేకుండా పోయిందని, గత ప్రభుత్వ పెద్దల అండదండలతో వారు విచ్చలవిడిగా విజిలెన్స్ దాడులను సైతం లెక్కచేయకుండా అవినీతికి పాల్పడ్డారని, ఈ క్రమంలోనే లెక్కకు మించి ఆస్తులు కూడగట్టుకున్నారని, అలాంటి వారిపై నూతన సర్కార్ ప్రత్యేక దృష్టి సారించిందని, అవసరమైతే పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన వారిపై అవినీతి నిరోధక శాఖ(ఎ.సి.బి)దాడులు సైతం జరిగే అవకాశం ఉందని స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాజన్న ఆలయంలో సమూల మార్పులు చోటుచేసుకుంటాయని, అవినీతి అధికారుల పని పట్టడంతో పాటు అభివృద్ధిలోను ఆలయం ముందుకు వెళ్తుందని రాజన్న భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వేచి చూడాలి మరి ఏమి జరుగుతుందో...?

## పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలి

### డిఆర్డిఏ శ్రీనివాసరావు





**మెదక్ బ్యూరో, జూన్06(అక్షరం న్యూస్):**
మెదక్ జిల్లాలో పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలో పాఠశాల ప్రారంభించే లోపు అనగా జూన్ 12వ తేదీలోపు అందించాలని ఏపీఎంలను డిఆర్డిఏ శ్రీనివాసరావు ఆదేశించారు.
ఈరోజు కలెక్టర్ కార్యాలయంలోని డిఆర్డిఏ కార్యాలయంలో ఏపీఎంలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలం భారీగా కావలసిన క్లాతు కట్ చేయించుకుని కాజా బటన్లు వేయించుకొని ఎనిమిదో తేదీలోపు సంబంధిత హెడ్మాస్టర్లకు అందించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి , డిపిఎం మోహన్ కెనడి, ప్రకాష్ ,ఏపీఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల బ్రతుకులు ఆగం



**-ఆరు నెలలుగా అందని వేతనాలు**
**-పట్టించుకోని అధికారులు**
**-అరిగోస పడుతున్న కుటుంబాలు**
**-ప్రభుత్వాలు మారిన పంచాయతీ కార్మికుల బ్రతుకులు మాత్రం మారడం లేదు**
**-పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలి**
**-కార్మికులకు కనీస భద్రత పరికరాలు చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు, రెండు**
**-జతల బట్టలు, సబ్బులు, కొబ్బరి నూనె ఇవ్వాలి**

**మహబూబాబాద్ /గార్ల /జూన్ 6/అక్షరం న్యూస్...**
అంటురోగాలు ప్రభలకుండా గ్రామాలను నిత్యం శుభ్రం చేస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడే గ్రామపంచాయతీ కార్మికులకు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గత ఆరు నెలలుగా జీతాలు అందక బాధిత కుటుంబాలు అరిగోస పడుతున్నాయి. జీతాల సమస్యకు నిరసనగా గ్రామపంచాయతీ




కార్మికులు విధులకు బహిష్కరిస్తే అంతటా చెత్త చెదారం పేరుకోపోయి గ్రామాలు కంపు కొట్టి ప్రజారోగ్యం మంటగలిసే ప్రమాదం పొంచి ఉంది.ప్రభుత్వాలు మారిన పంచాయతీ కార్మికుల బ్రతుకులు మాత్రం మారడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాపితంగా ఒక్కొక్క గ్రామపంచాయతీ లో రెండు నుండి ఆరు నెలల వరకు వేతనాల బకాయిలు ఉన్నాయి. కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోవడం దుర్భరంగ మారింది. కార్మికులకు ఇవ్వాల్సిన కనీస భద్రత పరికరాలు చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు, రెండు జతల బట్టలు, సబ్బులు, కొబ్బరి నూనె ఇవ్వాలని జి ఓ లు వచ్చినప్పటికీ వాటిని అమలు చేయడంలో మండల స్థాయి అధికారులు వైఫల్యం చెందారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో పంచాయతీ కార్మికులు పస్తులు ఉండాల్సిన స్థితి నెలకొంది. కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు, కానీ వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని కార్మికుల ఆందోళన. రెక్కాడితే కానీ డొక్కాడని పంచాయతీ కార్మికులతో జీతాల పేరుతో నిర్లక్ష్యం చేయడం సరికాదు. పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో సమ్మెకు పిలుపునిస్తే వర్షాకాలంలో పారిశుద్ధ్యం పడకేస్తే ప్రమాదమే అని ప్రజలు అంటున్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు వెంటనే ఆరు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వారికీ ఉద్యోగ భద్రత కల్పించాలని ఇందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.



## గోవులని వధిస్తే చూస్తూ ఊరుకోం గోవదశాలలపై చర్యలు తీసుకోవాలి

**పెద్దపల్లి టౌన్ జూన్ 06 అక్షరం న్యూస్**
జిల్లాలో అనుమతి లేకుండా కొనసాగుతున్న గోవధశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందువాహిని జిల్లా సహసంయోజక్ ఉయ్యంకార్ సాయి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ మేరకు జిల్లా కలెక్టరు కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ ఈ నెల 17న బక్రీద్ నేపథ్యంలో పెద్ద ఎత్తున గోవులను వధించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు పేర్కొన్నారు కోట్లాది మంది హిందువులు ఆరాధ్య దైవంగా భావించే గోమాతను కొంతమంది వ్యక్తులు ఉద్దేశ్యపూర్వకంగా వధిస్తున్నారని ఆరోపించారు గోవులను తరలించే వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు గత ఏడాది లాగే గోవధ నిషేద చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు గోవధ చేయడం చట్ట విరుద్ధమని అలాంటి వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు అనంతరం కలెక్టర్ కి వినతి పత్రం అందించారు వినతిపత్రం అందించిన వారిలో నగర అధ్యక్షుడు పూసాల శ్యాం ప్రధాన కార్యదర్శి వెంకట్ సాయి నాయకులు రాకేష్ వెంకటేష్ క్రాంతి నరేష్ తదితరులు ఉన్నారు

## హోటల్ యజమానులు పట్టణ ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని విక్రయించాలి

### మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్



**పెద్దపల్లి టౌన్**
**జూన్ 6 అక్షరం న్యూస్**
పెద్దపల్లి పట్టణంలోని పలు హోటళ్లపై మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నిలువ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీనపరచుకొని వాటిని మున్సిపల్ డంపింగ్ యాడ్ వద్ద ఖననం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట పెద్దపల్లి పట్టణ హోటల్ యజమానులు మీ వద్దకు వచ్చే కస్టమర్లకు నాణ్యమైన ఆహారాన్ని విక్రయించాలని నిల్వఉంచిన ఆహారాన్ని విక్రయించినట్లయితే పట్టణ ప్రజలు అనారోగ్యం బారిన పడటం జరుగుతుందని కావున ప్రతి ఒక్క యజమాని తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు లేనియెడల అట్టి హోటళ్లపై శాకపరమైన చర్యలు తీసుకోబడతాయని జరిమాణాలు విధించబడతాయని అన్నారు ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సంపత్,జూనియర్ అసిస్టెంట్లు డి.రమాకాంత్,పి.అనిల్ కుమార్,వార్డ్ ఆఫీసర్ లక్ష్మి నర్సయ్య సానిటరీ ఇన్స్పెక్టర్ పులిపాక రాజు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
-జూన్ 6 నుంచి జూన్ 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహణ
-ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు
-ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం విద్యార్థులకు అందజేత
-తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థలకు పంపాలని కలెక్టర్ పిలుపు
-ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచన
-పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్







**పెద్దపల్లి, ప్రతినిధి జూన్ -06 అక్షరం న్యూస్**

ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన విద్యా బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,లి విద్యా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని వారి పిల్లలను తప్పనిసరిగా చదివించాలని, ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలలో నమోదయ్యే దిశగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం జూన్ 6 నుంచి జూన్ 19 వరకు నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో వస్తున్న మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు అయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు కంటే మెరుగైన నాణ్యత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెబుతారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల యొక్క సంపూర్ణ అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరుగుతుందని, బట్టిపట్టే విధానం కాకుండా పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యే దిశగా వారికి వివరిస్తూ కొత్త బోధనా పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, దీని ఫలితంగా ఇటీవలే వచ్చిన పదవ తరగతి ఫలితాల్లో జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 97 శాతం మేర విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలను సాధిస్తున్నామని , ప్రభుత్వ పాఠశాలల్లో ఎటువంటి ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ గా ప్రతి నెల పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని, విద్యార్థుల పురోగతే లక్ష్యంగా ఎప్పటి కప్పుడు తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రపంచంలోనే అనేక దేశాలు విఫలమైన చంద్రయాన్ ప్రయోగాన్ని మన భారత శాస్త్రవేత్తలు విజయవంతం చేశారని, అటువంటి శాస్త్రవేత్తలు సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదివారని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉచితంగా అందించడంతో పాటు వారికి అవసరమైన యూనిఫామ్, పాఠ్య, నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాలల్లోని విద్యార్థులతో సంభాషిస్తూ వారు పెద్దయ్యాక ఏం అవ్వాలనుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ప్రణాళిక ప్రకారం చేరుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.

కార్యక్రమంలో పాల్గొన్న లిజిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి మాట్లాడుతూ,లి జూన్ 6 నుంచి జూన్ 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటి సర్వే చేపట్టి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు ముఖ్యమైన పాఠ్యాంశాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో లైబ్రరీ కార్నర్లను ఏర్పాటు చేశామని, గ్రంథాలయంలో విద్యార్థుల కోసం మంచి కథల పుస్తకాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని, అనవసరంగా ప్రైవేటు పాఠశాలల్లో చేర్చి డబ్బు వృధా చేసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఐఐటి, నీట్ ఫలితాల్లో మంచి ప్రదర్శన కనబరుస్తున్నా రని, క్రీడా పోటీలలో సైతం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అధికంగా రాణిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న లిలిపాఠశాల అకడమిక్ అధికారి డాక్టర్ పి.ఎం. షేక్ మాట్లాడుతూ,లి పెద్ద బొంకూర్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వసతులు, ఆట స్థలం అందుబాటులో ఉన్నాయని, మంచి నైపుణ్యం, అనుభవం కలిగిన ఉపాధ్యాయుల బృందంచే బోధన చేస్తున్నారని, వీటిని వినియోగించుకుంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న లిపెద్దబొంకూర్ జెడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. సుదర్శన్ మాట్లాడుతూ,లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, రెండు జతల స్కూల్ యూనిఫామ్స్, రుచికరమైన మధ్యాహ్న భోజనం, అనుభవం కలిగిన ఉపాధ్యాయు లచే బోధన, 6 నుంచి 10వ తరగతి లకు ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని అన్నారు. గ్రామంలో ఇంటింటికి సర్వే నిర్వహించి ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే దిశగా అవసరమైన కార్యాచరణ అమలు చేస్తామని అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ ఉన్నాయని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వ్యక్తిగతంగా వారి అభివృద్ధికి పర్యవేక్షిస్తామని, విద్యార్థులు శారీరకంగా అభివృద్ధి చెందేందుకు పాఠశాలలో క్రీడా ప్రాంగణం అందుబాటులో ఉందని, పాఠశాలల్లో అవసరమైన ప్రయోగశాల, ఐ.ఎఫ్.పి ద్వారా డిజిటల్ విద్యా బోధన అందిస్తున్నామని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా చేరుతున్నవిద్యార్థులకు అడ్మిషన్ ఫారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ సమత, అడిషనల్ డిఆర్డిఓ రవికుమార్, ఏపీఎం సంపత్, అంగన్వాడీ టీచర్స్ సుధా, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి సాగుకే రైతులు ఆసక్తి


## తొలకరి కోసం ఎదురు చూపులు
## సోయాతో నష్టాలు వస్తాయన్న భావన



ఆదిలాబాద్,జూన్6: ఈ ఏడాది పత్తి పంట సాగు వైపే రైతులు మళ్లీ పరుగులు తీస్తున్నారు.
గత అనుభవంతోనే ఈసారి పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. అందుకే పత్తి విత్తనాలకు డిమాండ్ పెరుగుతోంది.
గత కొన్నేళ్లుగా సంప్రదాయ పంటల సాగుతో రైతులకు భారీ నష్టాలు వస్తున్నాయని భావించిన ప్రభుత్వం గత ఏడాది నుంచి పత్తి పంట సాగును ప్రోత్సహిస్తూ వస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటలైన సోయా, కంది పంటల సాగు తగ్గుతూ వస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో సోయా, కంది పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ లబోదిబో మంటున్నారు. ఇలాంటి పరిస్థితు ల్లో ఈ ఏడాది పత్తి పంటనే సా గు చేసేందుకు జిల్లా రైతులు అ ధికంగా ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికారులు భావిస్తున్నట్లుగా మిశ్రమ పంటల సాగు విస్తీర్ణం తగ్గి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తుంది.అంచనాలకు మించిన ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఎచ్చుతగ్గుల కారణంగా పత్తి పంటకు ధరలు ఉండవని ప్రచారం జరిగినప్పటికీ గతేడు పత్తి పంటల ధరలు అంచనాలకు మించి ధర పలికింది. పంట చేతికి వచ్చినప్పటి నుంచి కొనుగోలు ముగిసే వరకు మద్దతు ధరను మించిన ధరలేదక్కాయి. తెల్ల బంగారం సిరులు కురిపించడంతో ఈ సారి కూడా రైతులు పత్తి పంటపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 20వేల ఎకరాలకు పై గా పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని అధికారులే చెబుతున్నారు. ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేసి తొలకరి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాధార పంటగా సాగయ్యే పత్తికి జిల్లా వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు నల్లరేగడి భూముల్లో అధిక దిగుబడులు రావడమే అసలు కారణమని రైతులు చెబుతున్నారు.
అధికారులు మాత్రం మిశ్రమ పంటలను సాగు చేస్తేనే మంచి ఫలితా లు వస్తాయని సూచిస్తున్నారు. రైతులు స్వయంగా పత్తి పంటను సాగు చేసిన అనుభవంతోనే ముందుకు సాగుతున్నారు. తొలకరి వర్షాలకే పత్తి పంటను విత్తుతే చీడ పీడల నుంచి తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయని పేర్కొంటున్నారు. వాణిజ్య పంటగా పత్తి పంటతో అప్పులు తీరే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక ఏడాది నష్టం వచ్చిన మరో ఏడాది ఆదుకోకపోతుందా అనే భావనతో పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ధరలు భాగానే ఉన్న పెట్టుబడి ఖర్చులు మరింతగా పెరిగి పోవడంతో లాభాలు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లా సాగు భూమి విస్తీర్ణం 5 లక్ష ల 71 వేల ఎకరాలు కాగా ఈ సారి 3లక్షల 95వేల 200 ఎకరాలలో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గతేడా కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయం గా పెరుగనుంది. మూడు నాలుగేళ్లుగా విస్తీర్ణం తగ్గినా గత ఏడాది ధరలు పుంజుకోవడంతో ఈసారి సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

# రిజర్వేషన్ల రద్దు పేరుతో దుష్ప్రచారం

**కాంగ్రెస్ తప్పుడు ప్రచారంతోనే దెబ్బతిన్నాం**
**తెలంగాణ ప్రజల గండెచప్పుడుగా ఉంటాం**
**భవిష్యత్‌లో తెలంగాణలో మరింత సత్తా చాటుతాం**
**ఏపిలో కూటమి గెలుపుతో మంచి రోజులు వచ్చాయి**
**బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడి**



న్యూఢిల్లీ,జూన్6: భాజపా రిజర్వేషన్లు రద్దు చేస్తుందని.. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో 47 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అత్యధిక ఓట్లు వచ్చాయి. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పోటీ చేయలేదు.. ఎంఐఎం పోటీ చేసింది. లోపాలు సరిదిద్దుకుని భవిష్యత్తులో రాష్ట్రంలో మా పార్టీ అధికారంలోకి వస్తుంది. 6 నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. భాజపాకు తెలంగాణ ప్రజలు 35 శాతానికిపైగా ఓట్లు వేశారు. మాపై విశ్వాసం ఉంచి.. అధిక స్థానాల్లో గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క శాతం ఓటింగ్ మాత్రమే పెరిగింది. తెలంగాణలో చాలా చోట్ల భారాసకు డిపాజిట్లు రాలేదు. రాష్ట్ర ప్రజలు కాషాయ పార్టీకి అండగా నిలబడ్డారు. గతంలో రేవంత్‌రెడ్డి గెలిచిన మల్కాజిగిరిలో కూడా మేం గెలిచాం. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిద్దిపేట ఉన్న మెదక్‌లో విజయం సాధించాం. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తారో భాజపా ప్రశ్నిస్తుంది. అమిత్‌షాపై తప్పుడు కేసు పెట్టారు. హస్తం పార్టీ మోసాలను ప్రజలకు వివరిస్తాం. ఏపీలో అద్భుతమైన మెజార్టీతో ఎన్డీయే అధికారంలోకి వచ్చింది. అక్కడి ప్రజలకు కృతజ్ఞతలని కిషన్‌రెడ్డి తెలిపారు.రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా సమిష్టిగా పనిచేస్తామని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అయిపోయిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాదు ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై ఆరు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అక్రమంగా డబ్బులు వసూలు చేసి ఢిల్లీకి పంపిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను ఇంకా నెరవేర్చడం లేదని గుర్తు చేశారు. ఫ్రీ ఆర్టీసీ బస్సు హామీ తప్ప ఏదీ నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ పోటీ చేసి బీజేపీని ఓడించాలని చూసిందని కిషన్ రెడ్డిఅన్నారు. కానీ వారు అనుకున్నది జరగలేదని వెల్లడించారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా బీజేపీ అత్యధికంగా ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లకు బలమైన ప్రత్యామ్నాయంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది. ూష్ట్రంలో బీజేపీ తెలంగాణ ప్రజల గుండెచప్పుడు అయ్యి సమస్యల గురించి నిలదీస్తామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు ఇటీవల ఏపీలో చంద్రబాబు నాయుడు, పురంధేశ్వరి, పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఎన్డీయే కూటమి బ్రహ్మాండమైన విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ ముగ్గురికి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఏపీ ప్రజలకు మంచి రోజులు రానున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# కేసీఆర్‌ను కలసిని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సిద్దిపేట,మే6: ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలువురు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తాం**
**విత్తనాల షాప్ లను ఆకస్మిక తనిఖీ**
**కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబాబాద్ /గార్ల /జూన్ 6/అక్షరం న్యూస్...**

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి కె.అభిమన్యుడు తో కలిసి మహబూబాద్ పట్టణంలోని విత్తన దుకాణం, కిసాన్ అగ్రిమాల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో బాగంగా విత్తన దుకాణంలో వున్న పత్తి, మిర్చి, వరి మొక్కజొన్న విత్తనాల స్టాక్ వివరాలు స్వయంగా పరిశీలించడం జరిగినది. ధరల పట్టిక ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్, రోజు వారిగా జరిగిన అమ్మకం మరియు రైతుల వివరాలు, రైతు వారిగా అమ్మిన విత్తన రిజిస్టర్ లను 'పరిశీలించారు. దుకాణంలో అనుమతిలేని విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారిని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మే విధంగా చూడాలని తెలిపారు. ప్రతిరోజు వచ్చిన సరుకు వివరాలు, రైతులకు అమ్మిన విత్తనాల వివరాలు, ముగింపు స్టాక్ -వివరాలు రికార్డులో వ్రాయాలని, లూస్ విత్తనాలు అమ్మినా, పీడీ యాక్ట్ కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.



జిల్లాలో డివిజను మరియు మండలాల వారిగా టాస్క్ ఫోర్స్ టీములు ( పోలీస్, రెవెన్యూ మరియు వ్యవసాయశాఖ) అధికారులతో ఏర్పాటు చేసామని,ఈ టాస్క్ ఫోర్స్ టీంలు ప్రతి రోజు విత్తన దుకాణాలను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకొని ప్రతిరోజు రిపోర్ట్-సబ్మిట్ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి తిరుపతి రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు .

## అధికారుల నిర్లక్ష్యం పట్టించుకోని ప్రజా ప్రతినిధులు.

**సంవత్సరం గడవకముందే కూలిన**
**డిగ్రీ కళాశాల ప్రహరి గోడ.**
**ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్.**

**నాగర్ కర్నూల్ జూన్ 6 (అక్షరం న్యూస్)**




అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గుత్తేదారు ఆడిందట పాడిన పాట గా మారింది పనులు నాణ్యతగా లేకపోవడంతో నాగర్ కర్నూల్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రహరి గోడ నిర్మించి మూడు నాలుగు నెలల గడవకముందుకే కూలి నెల మట్టంఅయ్యిందని బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమకూమార్ డిమాండ్ చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతోనే గోడ కూలిపోయిందని సంబంధింత అధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.తో 33 లక్షల ప్రజాధనం వృదా అయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .ప్రహరీ గోడ నిర్మాణం సమయంలో పలు ఆరోపణలు.వచ్చినాకళాశాల ప్రిన్సిపల్ పట్టించుకోలేదని ఫోన్ చేసి సమాచారం అడుగుతే తన ఇష్టానుసారంగా జవాబు ఇవ్వడం జరిగిందని ఆయన ఆరోపించారు . సంబంధిత అధికారులుఈ విషయంపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు .

## ఈనెల 8న దిక్కార కవితా సంకలనం ఆవిష్కరణ

**నాగర్ కర్నూల్ జూన్ 6 (అక్షరం న్యూస్)**

ఈ నెల 8వ తేదీన హైదరాబాద్, రవీంద్ర భారతి సమావేశపు హాల్లో దిక్కార ,మహాత్మ జ్యోతిబాపూలే స్ఫూర్తి కవిత్వం ఆవిష్కరణ సభ జరగుతుందని నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య ప్రధాన కార్యదర్శి పి వహీద్ ఖాన్ లు గురువారం తెలిపారు.'నెలపొడుపు' సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8 న.శనివారంఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, బుర్రా వెంకటేశం ఐఏఎస్ హాజరై పుస్తకాన్నీ ఆవిష్కరణ చేస్తారు. చరిత్రకారులు సాహిత్య విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ ఈ సభకు సభాధ్యక్షత వహిస్తారు.విశిష్ట అతిథులుగా ఎంఎల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న, రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కవి, విమర్శకులు జి.లక్ష్మీనరసయ్య, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా? మామిడి హరికృష్ణ, కవి, విమర్శకులు డా?బి. ప్రసాదమూర్తి, కవి, రచయిత్రి విశ్రాంత అధ్యాపకులు డాఎం ఏ.జయంతి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాఎం పసునూరి రవీందర్ లు ప్రసంగిస్తారని. కవి, కథకులు పి.వహీద్ ఖాన్ సభకు ఆహ్వానం పలుకుతారని, కవి, రచయిత ఆమ్ గోత్ వెంకట్ పవార్ వందన సమ ర్పణతో ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి కవులు కళాకారులు రచయితలు బహుజన బంధుమిత్రులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.



# అర్బన్ బ్యాంక్ ఎన్నికలలో బిఆర్ఎస్ ప్యానల్ గెలుపు

- కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత
- పోలీసుల లాఠీచార్జ్





రాజన్న సిరిసిల్ల/ జిల్లా స్టాపర్/ జూన్ 6 (అక్షరం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలో ఉత్కటంగా జరిగిన అర్బన్ బ్యాంక్ ఎన్నికలలో బిఆర్ఎస్ ప్యానల్ విజయ్ కేతనం ఎగురవేసింది. పార్టీల గుర్తులు లేకుండా జరిగిన ఈ ఎన్నికలలో 12 డివిజనులకు 8 డివిజన్ ల్ల లో బిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందగా ఒకటి బిజెపి ఒకటి కాంగ్రెస్ ఇద్దరు స్వతంత్రులు గెలుపొందారు. ఒకటవ డివిజన్ రాపెల్లి లక్ష్మీనారాయణ బిఆర్ఎస్, రెండవ డివిజన్ గుడ్ల సత్యానంద్ స్వతంత్ర, మూడవ డివిజన్ చొప్పదండి ప్రమోద్ కాంగ్రెస్, నాలుగవ డివిజన్ అడ్డగట్ల మురళి బిఆర్ఎస్, ఐదవ డివిజన్ తాటి కుమార్ రాజ్ బిఆర్ఎస్, ఆరవ డివిజన్ బుర్ర రాజు బిఆర్ఎస్, ఏడవ డివిజన్ వేముల సుక్కమ్మ బిఆర్ఎస్, ఎనిమిదవ డివిజన్ అడ్డగట్ల దేవదాస్ బిఆర్ఎస్, తొమ్మిదవ డివిజన్ ఎనగందుల శంకర్ బిఆర్ఎస్, పదవ డివిజన్ వలస హరిణి స్వతంత్ర, 11 వ డివిజన్ పత్తిపాక సురేష్ బిజెపి, 12వ డివిజన్ కోడం సంజీవ్ బిఆర్ఎస్ గెలుపొందారు. అర్బన్ బ్యాంక్ చైర్మన్ పదవి కైవసం చేసుకొనున్న బిఆర్ఎస్ పార్టీ

**పోలీసులు లాఠీచార్జ్.. కాంగ్రెస్ నేతల నిరసన**

బిజెపి అభ్యర్థి పత్తిపాక సురేష్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పదవి కోసం ప్రయత్నించగా బిఆర్ఎస్ నాయకులు తమ డైరెక్టర్లను కారులో తరలిస్తున్న సమయంలో తోపులాట జరిగింది. దీంతో పోలీసులు ఇరు వర్గాలపై లాటి చార్జి చేసి చెదరగొట్టారు. దీంతో కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాష్, సంగీతం శ్రీనివాస్ పోలీసులతో వాగ్ వివాదానికి దిగారు. దీంతో పోలీసులు ఉన్నతాధికారులు సముదాయించడంతో ఇరు వర్గాలు శాంతించారు.

## కొండగట్టు ఆంజనేయ స్వామి సేవకి చొప్పదండి జ్ఞాన సరస్వతి సేవా దళ్ సభ్యులు



చొప్పదండి/ కరీంనగర్,జూన్ 06 (అక్షరం న్యూస్ )

కరీంనగర్ జిల్లా చొప్పదండి శ్రీ జ్ఞాన సరస్వతి సేవాదళ్ సభ్యులు గురువారం రోజున దండే రమాదేవి ఆధ్వర్యంలో 42 మంది కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో పరకామణి సేవకు వెళ్లారు. కొండగట్టు కు వెళ్లిన వారిలో

గుర్రం మంగ, గుర్రం విజయ,చిలకలూరి శ్రీలక్ష్మి,లావణ్య,రమాదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు

## క్రిమినల్‌చట్టాలపై పోలీసు అకాడమీలో వర్క్‌షాపులో పాల్గొన్న డీజీపీ రవి గుప్త






రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 06 / అక్షరం న్యూస్ : క్రిమినల్ చట్టాలపై పోలీసు సిబ్బంది అవగాహనను కలిగి ఉండి నేరాల అదుపుకు వాటిని వినియోగించాలని డీజీపీ రవి గుప్త అన్నారు. రాజ బహద్దూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీలో గురువారం కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఒక రోజు వర్క్‌షాపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త చట్టాలపై పోలీసులు అవగాహనను పెంచుకోవాలన్నారు. న్యూ క్రిమినల్ లాస్ యాప్ ను డీజీపీ ప్రారంభించారు. అనంతరం అధికారులు ద్వారా ప్రెసెంటేషన్, ఇంటరాక్టివ్ చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో హెూం సెక్రటరీ డాక్టర్ జితేందర్, క్రిమినల్ లాయర్ ఏపీ సురేష్, అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బీస్ట్, సీఐడీ అదనపు డీజీపీ శిఖా గోయెల్, ఇతర సీనియర్ పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిని అడ్డుకోవాలి : దుడ్డు ఆకాష్, భోగాల శ్రీకాంత్‌లు



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 06 / అక్షరం న్యూస్ : నార్సింగి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆకాష్, భోగాల శ్రీకాంత్ లు అన్నారు. గురువారం ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డిని కలిసి నార్సింగి మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట్ గ్రామంలోని ఖాళీ స్థలంలో ఎలాంటి ఇళ్లు కట్టకుండానే 12 ఇళ్లకు ఇంటి నెంబర్లను మంజూరు చేశారన్నారు. ఈ ప్రాంతంలో ఒక్కో ఫ్లాట్ విలువ రూ.6 కోట్లకు పైచిలుకుగా ఉంటుందన్నారు. ఇంత విలువైన స్థలంలో ఇండ్లను కట్టకుండానే అక్రమంగా ఇంటి నెంబర్లను ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ మేరకు విచారించాలని వారు కోరారు.

## వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం




రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 06 / అక్షరం న్యూస్ : మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకొని గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఓలం యాదగిరి భోజనం చేసేందుకు వచ్చిన వారికి ఆహారాన్ని వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ అమావాస్య రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమాన్ని వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

## మంచినీటిని ప్రజలకు సరిపోయేలా సరఫరా చేయాలి : కార్పొరేటర్ సాగర్‌గౌడ్





రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 06 / అక్షరం న్యూస్ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 20 వ డివిజన్‌లో నీటి సరఫరాను పెంపొందించి ప్రజలకు తాగునీటికి సహకరించాలని కార్పొరేటర్ సాగర్ గౌడ్ అన్నారు. గురువారం కార్పోరేషన్ జలమండలి మేనేజర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా రోజుల నుంచి తాగునీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నప్పటికీ నీరు సరిపోవడం లేదన్నారు. ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని స్పందించి మంచినీటిని సరిపోను మోతాదులో విడుదల చేయాలమని కోరామన్నారు. ఈ మేరకు మేనేజర్ సానుకూలంగా స్పందించారని వివరించారు.

# కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానించిన తోకల శ్రీనివాస్‌రెడ్డి





రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 06 / అక్షరం న్యూస్ : చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు బీజేపీ పార్టీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీజేపీ బలంగా ఉందని, పార్టీని సమన్వయం చేసుకొని పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యరక్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్సై రాజేష్ గౌడ్



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 06 / అక్షరం న్యూస్ : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనను కలిగి ఉండాలని నార్సింగి ఎస్సై రాజేష్‌గౌడ్, రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ఈవెంట్ లో కోఆర్డినేటర్ కేశవ్ లు అన్నారు. గురువారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం వారు తలపెట్టిన నార్సింగి టీ గ్రిల్ జంక్షన్ వద్ద నార్సింగి సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండి ప్రమాదాల నివారణకు చొరవ చూపాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని వాహనదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు నితా వద్దేరి, దిలీప్ కక్కడ్, రాజశేఖర్ రెడ్డి, నోయెల్ జయకర్, శ్రీనివాస్ గోరితి, మహేష్ కుమార్, నాగేష్, కల్యాణి, రాజ్రెడ్డి, శ్రీకాంత్, పాల్ రాజ్, వైభవ్, ఒబేద్ మాషి, అఫ్తాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నారుగూడెంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట ర్యాలీ ప్రారంభించిన ఎంఈఓ దామోదర ప్రసాద్






ఖమ్మం /తల్లాడ జూన్ 6 (అక్షరంన్యూస్)

తల్లాడ మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడి బాట.కార్యక్రమాన్ని మండల విద్యశాఖాధికారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్నారుగూడెం హెడ్ మాస్టర్ నెమ్మకంటి దామోదర ప్రసాద్ గురువారం ప్రారంభించారు.బడిబాట కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పాఠశాల లో సన్నాహక సమావేశం ఎంఈఓ అధ్యక్షతన జరిగింది అదేవిధంగా బడిబాట ప్రతిజ్ఞ ను ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు,గ్రామస్థులు అమ్మ ఆదర్శ పాటశాల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినారు. విద్యా కార్యక్రమాలను నిర్వహించే విధానాలపై ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని వందకు వందశాతం జరిగేలా చూడాలని ప్రభుత్వ పాఠశాలల విద్య ప్రమాణాల యొక్క ఆవశ్యకతను వివరించాలని ఆయన ఉపాధ్యాయులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాదినేని నరసింహరావు, యం.యం రాజ కుమారి, పులి వెంకటేశ్వర్లు,చావా గిరిజారాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజని, ప్రధానోపాధ్యాయులు వేంకటేశ్వర్లు, గొడ్ల సమత, తదితరులు పాల్గొన్నారు .

# గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ తదితర అంశాలపై సమీక్ష...

### వానాకాలం పంట సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్యత... మిషన్ భగీరథ త్రాగు నీటి సరఫరా...ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ తదితర అంశాలపై.... జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష...






ఖమ్మం /తల్లాడ జూన్ 6 (అక్షరంన్యూస్)

జూన్ 9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, ఇతర రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ, వానాకాలం పంట సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్యత, మిషన్ భగీరథ త్రాగు నీటి సరఫరా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, అధికారులు ఎటువంటి చిన్న తప్పిదాలు జరుగకుండా, గతంలో నిర్వహించిన పరీక్షల అనుభవంతో జూన్ 9న ఉదయం 10-30 నుండి మధ్యాహ్నం 1-00 వరకు నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షను ప్రశాంత వాతావరణంలో, సజావుగా జరిగేలా కట్టుదిట్టంగా ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. ప్రశ్నా పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను సన్నద్ధం చేయాలని, శుక్రవారం జిల్లాలకు ముఖ్యమైన సామాగ్రి, ప్రశ్నా పత్రాలు చేరుకుంటాయని, వాటిని భద్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రం సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను పూర్తి స్థాయిలో మూసివేయాలని సీఎస్ సూచించారు. స్ట్రాంగ్ రూం నుండి పరీక్షా కేంద్రానికి ప్రశ్నా పత్రాలు, తిరిగి పరీక్షా కేంద్రం నుండి జవాబు పత్రాలు రిసెప్షన్ సెంటర్ కు తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీస్ బందోబస్తుతో తీసుకొని వెళ్ళి పరీక్షా కేంద్రాల్లోని లైజనింగ్ అధికారులకు అందజేయాలని, రిసెప్షన్ సెంటర్ లో టి.జి.ఎస్.పి.ఎస్.సి. అధికారులకు అందజేయాలని ఆదేశించారు.

వానాకాలం పంట సీజన్ ప్రారంభమవుతుందని, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువుల స్టాక్ మన రాష్ట్రంలో ప్రతి జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీ లో ఎక్కడా ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ లకు సీఎస్ తెలిపారు. రాబోయే 20 నుంచి 25 రోజుల వ్యవధిలో చాలా వరకు రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తారని, ఈ సమయంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నకిలీ విత్తనాలను అరికట్టాలని అన్నారు. వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ నకిలి విత్తనాలు ఎక్కడా విక్రయించకుండా చూడాలని, నకిలి విత్తనాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు ప్రభుత్వం గుర్తించిన లైసెన్స్ విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు రశీదు తీసుకోవాలని, సీల్డ్ ప్యాకెట్లను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని విస్తృతంగా ప్రచారం చేయాలని సీఎస్ సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలపై రిజిస్టర్ నిర్వహించాలని అన్నారు. వానా కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమయ్యే పచ్చి రొట్టె విత్తనాలు సైతం అందుబాటులో ఉంచాలని, వరి సన్న రకాల విత్తనాల స్టాక్ లు ఉంచాలని తెలిపారు. పత్తి విత్తనాలను రైతులకు అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని, రైతులకు అవసరమైన రకాల విత్తనాలు అందుబాటులో లేని పక్షంలో త్వరితగతిన సదరు విత్తనాల స్టాక్ మార్కెట్ లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మంచి విత్తనాలు రైతులు వినియోగించాలని అన్నారు. జిల్లాలో ముందుగా ఎక్కడ వ్యవసాయం ప్రారంభమవుతుందో, ఎక్కడ నాట్లు వేస్తారో ఆ ప్రాంతాలలో ఎరువులు, విత్తనాలు అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. నకిలీ విత్తనాల గురించి సమాచారం అందితే వెంటనే మీడియా ద్వారా రైతులను అప్రమత్తం చేయాలని, నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న వారిపై పి.డి. యాక్ట్ క్రింద కేసులను నమోదు చేయాలని, సదరు సమాచారాన్ని సైతం మీడియాకు ఎప్పటికప్పుడు అందించాలని సీఎస్ సూచించారు. వానాకాలం సాగులో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు నిపుణుల ద్వారా అందించేందుకు రైతు నేస్తం కార్యక్రమం క్రింద రైతు వేదికల వద్ద ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టం పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. వేసవికాలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా త్రాగునీటిని విజయవంతంగా సరఫరా చేయడంలో అధికారులు సఫలీకృతులయ్యారని, ఇదే స్ఫూర్తితో రాబోయే 20 రోజులలో సైతం అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. త్రాగునీటి సరఫరాను జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి ఇంటికి సరిపడా త్రాగునీరు సకాలంలో సరఫరా అయ్యేందుకు అవసరమైన చర్యలు కట్టుదిట్టంగా తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాపై సర్వే నిర్వహించి నివేదికను సమర్పించాలని సిఎస్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటినీ సందర్శించి మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా స్థితిగతులను పరిశీలించి నివేదిక సమర్పించాలని సీఎస్ పేర్కొన్నారు.

సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందని, దీనిని క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేయాలని, సింగల్ యూజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయక బట్ట సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సిఎస్ పేర్కొన్నారు.

పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే ప్రతి విద్యార్థికి రెండు జతల స్కూలు యూనిఫామ్ కుట్టించి అందజేయాలని సీఎస్ ఆదేశించారు.

ఈ సందర్భంగా టిజి పిఎస్సి చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రూప్-1 పరీక్ష ఎంతో ప్రతిష్టాత్మకమైనదని, ఏ చిన్న పొరపాటు లేకుండా సజావుగా చేపట్టాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి క్యాలిక్యులేటర్, పేజర్స్, సెల్ ఫోన్స్, ట్యాబ్లెట్స్, పెన్ డ్రైవ్స్, బ్లూ టూత్ డివైస్, వాచేస్, వాలెట్, హ్యాండ్ బ్యాగ్స్, జ్యూవెల్లరి, రైటింగ్ ప్యాడ్స్, నోట్స్, చార్ట్స్, లూజ్ షీట్స్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, రికార్డింగ్ పరికరాలు అనుమతి లేదని, ఫ్రిస్కింగ్ పకడ్బందీగా చేయాలని అన్నారు. అభ్యర్థులు షూస్ వేసుకొని రావద్దని తెలిపారు. హాల్ టికెట్స్ డౌన్లోడ్ చేసుకోవాలని, ఒకరోజు ముందుగా పరీక్షా కేంద్రానికి వెళ్లి చూసుకోవాలని అన్నారు. హాల్ టికెట్ పై ఫోటో సరిగ్గా లేకపోతే గెజిటెడ్ అధికారిచే ధృవీకరించిన లేటెస్ట్ ఫోటో అతికించి,వ్3 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, గ్రూప్-1 పరీక్షల నిర్వహణ కు ఖమ్మం జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు, 18403 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. 13 సెక్టార్లుగా విభజించి, 13 ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించినట్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులకు రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమం చేపట్టినట్లు, శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్, శాఖాధికారులు, రూట్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేపట్టి, పరీక్షలు సజావుగా విజయవంతం చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డిసిపి ప్రసాద రావు, జిల్లా రెవిన్యూ అధికారిణి రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా రవాణా అధికారిణి ఆఫ్రీన్ సిద్దిఖీ, డిప్యూటీ ఆర్ఎం భవాని ప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విత్తన విక్రయ షాపులు, తమ షాపులో ఉన్న విత్తనాలు, నిల్వ వివరాలు రైతులకు అర్థం అయ్యేలా తెలుగులో ప్రదర్శించాలి...

- జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్





ఖమ్మం /తల్లాడ జూన్ 6 (అక్షరంన్యూస్)

విత్తన విక్రయ షాపులు, తమ షాపులో ఉన్న విత్తనాలు, నిల్వ వివరాలు రైతులకు అర్థం అయ్యేలా తెలుగులో ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్, స్థానిక గాంధీ చౌక్, బర్మా షెల్ రోడ్ లోని విత్తన, ఎరువుల విక్రయ దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, షాపులలో స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ బుక్, బిల్ బుక్ లను, విత్తన బస్తాలపై లాట్ నంబర్, ఎం.ఆర్.పీ. రేటు, బ్యాచ్ నెంబర్, గడువు తేదీ తదితర వివరాలను పరిశీలించారు. ఎరువులు, విత్తన అమ్మకాలకు తగిన అనుమతులు పొందిన పత్రాలను పరిశీలించి, దుకాణదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఏ ఏ ప్రాంతాల నుండి వస్తున్నది, ఏ ఏ రకాలు అడుగుతుంది అడిగి తెలుసుకున్నారు. ఇతర షాపులకు అమ్మినది, రైతులకు నేరుగా అమ్మినది రిజిషర్లు విడి విడిగా నిర్వహించాలన్నారు. షాపుల వద్ద విత్తన కొనుగోలుకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఎక్కడి నుండి వచ్చింది, ఏ పంట సాగు చేస్తున్నది, గత సీజన్ లో ఏ పంట సాగు చేసింది, ఏ రకం విత్తనాలు కొంటున్నది, షాపు వారు ఎం.ఆర్.పి. రేటుపై ఇస్తున్నారా, అదనంగా అడుగుతున్నారా అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ లో 240 రకాలు ఉన్నట్లు, ప్రతి రకం ఒకే విత్తనాలని, ఒకే దిగుబడి ఇస్తాయని, పేరును చూసి, అదే రకం విత్తనాలు కావాలని, ఆ రకానికి డిమాండ్ పెంచి, రైతులు ఇబ్బందులు పడొద్దని తెలిపారు. భూమి పరిస్థితి, యాజమాన్య పద్ధతులను బట్టి, దిగుబడి ఉంటుందని, విత్తన రకాన్ని బట్టి కాదని, అన్నిటికీ సమాన దిగుబడి వస్తుందని అన్నారు. రైతులు తమ భూముల్లో ఒకటికి మించి రకాల విత్తనాలను కొనుగోలు చేసి సాగుచేయాలని కలెక్టర్ అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా గల అన్ని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కూడిన టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని అన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువుల కారణంగా ఎక్కడ కూడా ఏ ఒక్క రైతు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. పోలీసు, రెవెన్యూ అధికారులను సమన్వయము చేసుకుని అన్ని దుకాణాలలో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. నకిలీ ఎరువులు, విత్తన విక్రయాలను ఎంతమాత్రం సహించేది లేదని, రైతులను నష్టపరిచే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. జిల్లాలో విత్తనాలు ఎలాంటి కొరత లేదని, అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు. రైతులు ప్యాక్ చేసిన విత్తనాలు మాత్రమే కొనాలని, లూజ్ విత్తనాలు, సీల్ తీసిన విత్తనాలు కొనవద్దని ఆయన అన్నారు. విత్తనాలు కొనే ముందు రైతులు హోలోగ్రామ్ చూసి కొనాలని ఆయన తెలిపారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలోను, రైతు వేదికల వద్ద రైతులకు అవగాహన కార్యక్రమాలు విస్తృత పరచాలన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస రావు, ఖమ్మం అర్బన్ మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు, అధికారులు, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, మెరుగైన విద్యా బోధనతో పిల్లల తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాలి...

- ప్రభుత్వ పాఠశాలల్లో నమోదులు పెరిగేలా చర్యలు తీసుకోవాలి...
- అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్

ఖమ్మం/ తల్లాడ జూన్ 6 (అక్షరంన్యూస్)




ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, మెరుగైన విద్యా బోధనతో పిల్లల తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నమోదులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో బడిబాట కార్యక్రమ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలలో నమోదయ్యే దిశగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం జూన్ 6 నుంచి జూన్ 19 వరకు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో వస్తున్న మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు అయ్యేలా చూడాలని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు కంటే మెరుగైన నాణ్యత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెబుతారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల యొక్క సంపూర్ణ అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరుగుతుందని, బట్టిపట్టే విధానం కాకుండా పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యే దిశగా వారికి వివరిస్తూ కొత్త బోధనా పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రయివేటు పాఠశాలల కంటే మెరుగ్గా ఉత్తీర్ణత ఫలితాలు వస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉచితంగా అందించడంతో పాటు వారికి అవసరమైన యూనిఫామ్, పాఠ్య, నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, డిఆర్డీవో సన్యాసయ్య, జెడ్పి సిఇఓ వినోద్, సిపిఓ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారిణి డా. బి. మాలతి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి సత్యనారాయణ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమూది, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జ్యోతి, కార్మిక శాఖ సహాయ కమీషనర్ వెంగమాంబ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలి...

**జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్**

ఖమ్మం/ తల్లాడ జూన్ 6 (అక్షరంన్యూస్)



అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్, కొనిజర్ల మండలం అమ్మపాలెం, బస్వాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేశారు. పాఠశాలకు మంజూరు నిధులు, చేపట్టిన పనులు, పూర్తయిన పనులు, ఇంకనూ పూర్తి కావాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అడ్వాన్స్ ఎంత అందినది, పనులు పూర్తయిన వాటి విలువ వివరాలు అడిగారు. పూర్తయిన పనులకు వెంటనే బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుద్దీకరణ, టాయిలెట్ బ్లాకులు, త్రాగునీటి సరఫరా పనులు పరిశీలించారు. టాయిలెట్లలో రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు. పాఠశాల ప్రవేశ ద్వారం, పాఠశాల లోపల వీధి దీపాలు అమర్చాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభంలో వచ్చే పిల్లలకు తమ పాఠశాలలో స్పష్టమైన మార్పు రావాలన్నారు. పాఠశాలల్లో నమోదులు పెరిగేలా బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధన జరుగుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రుల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

కలెక్టర్ తనిఖీల సందర్భంగా డిఇఓ సోమశేఖరశర్మ, ఎంపిడివో రోజారాణి, ఎంఇఓ శ్యామ్సన్, పాఠశాల హెచ్ఎంలు వై. కోటేశ్వరరావు, సిహెచ్. వెంకటేశ్వర్లు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించిన పోలీసులు



హనుమకొండ/భీమదేవరపల్లి/జూన్ 06(అక్షరం న్యూస్):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర-రత్నగిరి ప్రధాన రహదారిపై గురువారం కురిసిన గాలివానకు భారీ వేప చెట్టు విరిగిపడడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న వంగర పోలీసులు జెసిబి సహాయంతో దాదాపు మూడు గంటలు శ్రమించి, పెద్ద చెట్టును పక్కకు తొలగించారు. సహాయక చర్యల్లో ఏఎస్ఐ ప్రకాష్, కానిస్టేబుల్ రమేష్ , మాజీ సర్పంచ్ వంగ సురేష్ ఉన్నారు. చెట్టును తొలగించడంలో చొరవ చూపిన పోలీసులను వాహనదారులు అభినందించారు.

# డాక్టర్ మట్టా దయానంద్ ను కలిసిన బేగ్ నాగుల్ మీరా..



ఖమ్మం/ తల్లాడ జూన్ 6 (అక్షరంన్యూస్)

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ను కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ సెల్ నాయకులు, తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన బేగ్ నాగుల్ మీరా కలిశారు. గురువారం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు చర్చించుకున్నారు. అనంతరం నాగుల్ మీరా మాట్లాడుతూ మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించి మాట్లాడినట్లు తెలిపారు.

## నగర వాసులకు అలర్ట్

**పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం**

హైదరాబాద్,జూన్6( (అక్షరంన్యూస్)

నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం ఆరు నుంచి మరుసటి రోజు ఆరు గంటల వరకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వాటర్‌బోర్డు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని లింగంపల్లి, పటాన్‌చెరు, ఈఎస్ఐ కమాన్ తదితర ప్రాంతాల్లో ఉన్న 900 ఎంఎం దయా పీఎస్సీ పైపులైన్‌కు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు శుక్రవారం ఉదయం ఆరు నుంచి శనివారం ఉదయం ఆరుగంటల వరకు 24 గంటలపాటు జరగనున్నాయి. దీంతో అపరేషన్ మెయింటనెన్స్ 8, 9డివిజన్లలో నీటి సరఫరాలో అంతరాయం కలుగనుందని, పటాన్‌చెరు, ఆర్సీ పురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, హఫీజ్ పేట్, డోయెన్స్‌కాలనీ, ఎస్‌బీఐ ట్రైనింగ్ సెంటర్, బీహెచ్‌ఈఎల్ ఫ్యాక్టరీ, టౌన్‌షిప్, హెచ్‌సీయూ, పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతవాసులకు అంతరాయం తలెత్తుందని అధికారులు తెలిపారు.

## కెసిఆర్‌ను కలసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సిద్దిపేట,మే6 అక్షరంన్యూస్)

ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలువురు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

## చంద్రబాబుకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

హైదరాబాద్,మే6అక్షరంన్యూస్)

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు సిఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు సిఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న తరుణంలో రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని రేవంత్ ఆకాంక్షించారు. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యలను పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి 135, జనసేన 21, వైఎస్ఆర్ సిపి 11, బిజెపి 8 సీట్లలో గెలిచిన విషయం తెలిసిందే. 175 సీట్లకు ఎన్ డిఎ కూటమి 164 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది.

# రిజర్వేషన్ల రద్దు పేరుతో దుష్ప్రచారం

- కాంగ్రెస్ తప్పుడు ప్రచారంతోనే దెబ్బతిన్నాం
- తెలంగాణ ప్రజల గండెచప్పడుగా ఉంటాం
- భవిష్యత్‌లో తెలంగాణలో మరింత సత్తా చాటుతాం
- ఎపిలో కూటమి గెలుపుతో మంచి రోజులు వచ్చాయి
- బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడి




న్యూఢిల్లీ,జూన్6అక్షరం న్యూస్)

భాజపా రిజర్వేషన్లు రద్దు చేస్తుందని.. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో 47 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అత్యధిక ఓట్లు వచ్చాయి. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పోటీ చేయలేదు.. ఎంఐఎం పోటీ చేసింది. లోపాలు సరిదిద్దుకుని భవిష్యత్తులో రాష్ట్రంలో మా పార్టీ అధికారంలోకి వస్తుంది. 6 నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. భాజపాకు తెలంగాణ ప్రజలు 35 శాతానికిపైగా ఓట్లు వేశారు. మాపై విశ్వాసం ఉంచి.. అధిక స్థానాల్లో గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క శాతం ఓటింగ్ మాత్రమే పెరిగింది. తెలంగాణలో చాలా చోట్ల భారాసకు డిపాజిట్లు రాలేదు. రాష్ట్ర ప్రజలు కాషాయ పార్టీకి అండగా నిలబడ్డారు. గతంలో రేవంత్‌రెడ్డి గెలిచిన మల్కాజిగిరిలో కూడా మేం గెలిచాం. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిద్దిపేట ఉన్న మెదక్‌లో విజయం సాధించాం. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తారో భాజపా ప్రశ్నిస్తుంది. అమిత్‌షాపై తప్పుడు కేసు పెట్టారు. హస్తం పార్టీ మోసాలను ప్రజలకు వివరిస్తాం. ఏపీలో అద్భుతమైన మెజార్టీతో ఎన్డీయే అధికారంలోకి వచ్చింది. అక్కడి ప్రజలకు కృతజ్ఞతలని కిషన్‌రెడ్డి తెలిపారు.రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా సమిష్టిగా పనిచేస్తామని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అయిపోయిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాదు ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై ఆరు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అక్రమంగా డబ్బులు వసూలు చేసి ఢిల్లీకి పంపిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను ఇంకా నెరవేర్చడం లేదని గుర్తు చేశారు. ఫ్రీ ఆర్టీసీ బస్సు హామీ తప్ప ఏదీ నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ పోటీ చేసి బీజేపీని ఓడించాలని చూసిందని కిషన్ రెడ్డిఅన్నారు. కానీ వారు అనుకున్నది జరగలేదని వెల్లడించారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా బీజేపీ అత్యధికంగా ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లకు బలమైన ప్రత్యామ్నాయంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది. ాష్ట్రంలో బీజేపీ తెలంగాణ ప్రజల గుండెచప్పుడు అయ్యి సమస్యల గురించి నిలదీస్తామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు ఇటీవల ఏపీలో చంద్రబాబు నాయుడు, పురంధేశ్వరి, పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఎన్డీయే కూటమి బ్రహ్మాండమైన విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ ముగ్గురికి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఏపీ ప్రజలకు మంచి రోజులు రానున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఎపి సిఎస్ జవహర్ రెడ్డి ఔట్

- సెలవుపెట్టి వెళ్లిపోయినట్లు సమాచారం
- సెలవుపై వెళ్లిన ఆర్థికశాఖ కార్యదర్శి రావత్
- సలహాదారుల రాజీనామాలకు ఆదేశాలు
- డిప్యుటేషన్ అధికారులపై నిర్ణయం పెండింగ్



అమరావతి,మే6((అక్షరంన్యూస్)

ఎపిలో ప్రభుత్వం ఏర్పాటుకు ముందే పలు కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్ఆనయి. సెలవుపై వెళ్లాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని సాధారణ పరిపాలన శాఖ ఆదేశించింది. దీంతో ఆయన సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఈ నెలాఖరును ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ కూడా సెలవుపై వెళ్లారు. అనారోగ్య కారణాలతో లీవ్ పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జవహర్‌రెడ్డి సెలవుపై వెళ్లిన నేపథ్యంలో వెంటనే కొత్త సీఎస్‌ను నియమించే అవకాశముంది. మరోవైపు ఇప్పటికీ రాజీనామా చేయని ప్రభుత్వ సలహాదారులను తక్షణమే తొలగించాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. త్వరలో మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఐఏఎస్ అధికారుల పోస్టింగ్ లలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి పదవీకాలం జూన్ నెలాఖరుకు ముగుస్తున్న నేపథ్యంలో కొత్త సీఎస్‌గా విజయానంద్‌ను నియమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి కె. విజయానంద్ గత ప్రభుత్వంలో కొన్ని రోజులు అదనపు సీఎస్‌గా వ్యవహరించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన విజయానంద్ ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలో కలెక్టర్‌గా, ఏపీ ట్రాన్స్ కో , ఏపీ జెన్ కో సీఎండీగా పనిచేశారు. రాష్ట్ర విభజన తదుపరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఎనర్జీ, ఐటీ మంత్రిత్వ శాఖల ముఖ్యకార్యదర్శిగా పనిచేయడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవోగా బాధ్యతలు నిర్వహించారు. విజయానంద్ ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఇదిలావుంటే బుధవారం చంద్రబాబును సీఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జూన్ 12న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో కొత్త ప్రభుత్వం కొలువు తీరనుంది. మరోవైపు జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన పలువురు కీలక ఐఏఎస్ అధికారులు సెలవుపై వెళ్లినట్లు తెలుస్తుంది. ఇక గత ప్రభుత్వంలో సీఎస్ జవహర్ రెడ్డి జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే విశాఖపట్నంలో జరిగిన భూ కుంభకోణంలో ఆయన కుమారుడు ప్రమేయం ఉన్నట్లు జనసేన పార్టీ నాయకుడు మూర్తి యాదవ్ ఘాటైన విమర్శలు చేశారు. ఆ విమర్శలకు సీఎస్ జవహరెడ్డి సైతం స్పందించారు. అనంతరం విశాఖ వేదికగా జరిగిన భూ కుంభకోణంపై సీఎస్ జవహర్ రెడ్డికి మూర్తి యాదవ్ పలు ప్రశ్నలు సంధించారు. వీటికి సమాధానం చెప్పాలంటూ సీఎస్ జవహరెడ్డికి సవాల్ విసిరారు. ఇకపోతే ఆంధ్రప్రదేశ్‌కు డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త ప్రభుత్వం రానున్న దృష్ట్యా డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులను రిలీవ్ చేయకూడదని నిర్ణయించింది. డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు రిలీవ్ చేయాలని ఇప్పటికే పలువురు అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. డిప్యుటేషన్‌పై వచ్చిన వారిపై గతంలో తెలుగుదేశం పార్టీ పెద్ద ఎత్తున విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఇకపోతే రాష్ట్రంలో టీచర్ల బదిలీలపై ఎన్నికల కోడ్‌కు ముందు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేశారు. ఎలాంటి బదిలీలు చేపట్టవద్దని డీఈవోలను ఆదేశించారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు మొత్తం 1800 మంది టీచర్లను బదిలీ చేయాలని గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సీఎం పేషీలోని కొందరు అధికారుల ఒత్తిడితో పైరవీలు, సిఫార్సులు జరిగాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

## చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలుస్తున్న అధికారులు

- కొందిరిని మాత్రం అనుమతించని పోలీసులు
- సంజయ్, పిఎస్ఆర్, రఘురామిరెడ్డిలకు నో ఎంట్రీ
- ఉండవల్లికి రాగానే తిప్పి పంపిన పోలీసులు

అమరావతి,జూన్6అక్షరంన్యూస్)

జగన్ ప్రభుత్వంలో అధికారం చెలాయించి అక్రమంగా కేసులు పెట్టి వేధించన అధికారులకు టిడిపి షాక్ ఇచ్చింది. చంద్రబాబును కలిసేందుకు వచ్చిన ఆ అధికారులను సెక్యూరిటీ సిబ్బంది వెనక్కి పంపారు. కాబోయే సీఎం చంద్రబాబును కలిసేందుకు యత్నించిన వివాదాస్పద ఐపీఎస్ అధికారులకు అనుమతి నిరాకరించారు. మర్యాద పూర్వక భేటీ పేరుతో రాగా పోలీసులు అడ్డుకున్నారు. చంద్రబాబును కలిసేందుకు సీఐడీ చీఫ్ సంజయ్ యత్నించారు. కరకట్ట గేటు వద్దే కానిస్టేబుళ్లు ఆయన కారును ఆపి వెనక్కి పంపారు. చంద్రబాబుపై అక్రమ కేసుల నమోదులో సంజయ్ కీలకంగా వ్యవహరించారు. ఎన్నికల ఫలితాలు రాగానే విదేశాలకు వెళ్లేందుకు సెలవు పెట్టారు. అది కూడా రద్దయినట్లు సమాచారం. మర్యాదపూర్వక భేటీ పేరుతో సంజయ్ వచ్చిన విషయాన్ని అధికారులకు గేటు సిబ్బంది చెప్పారు. అనుమతి లేదని చెప్పడంతో ఆయన కారును వెనక్కి పంపారు.ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు గురువారం ఉదయం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్దకు చేరుకోగా అనుమతి లేదని చెప్పారు. ఎన్నికల విధుల్లో అవకతవకలకు పాల్పడ్డారని ఆయన్ను ఎన్నికల సంఘం తప్పించింది. ఆ తర్వాత అనధికారికంగా కూడా వైకాపా కోసం పనిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు నివాసానికి వెళ్లే మార్గంలో ప్రధాన గేటు వద్దే కానిస్టేబుళ్లు పీఎస్ఆర్ కారును ఆపారు. లోపలికి అనుమతి లేదని స్పష్టం చేశారు. దీంతో చేసేదేమీ లేక ఆయన వెనుదిరిగారు. మరో సీనియర్ ఐపీఎస్ అధికారి కొల్లి రఘురామిరెడ్డికి అనుమతి నిరాకరించారు. చంద్రబాబును కలిసేందుకు ఫోన్‌లో అధికారులను ఆయన అనుమతి కోరగా తిరస్కరించారు. నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేసే సమయంలో రఘురామిరెడ్డి కీలకంగా వ్యవహరించారు. ఎన్నికల సమయంలో వైకాపాకు విధేయుడిగా ఉన్నారంటూ ఈసీ ఆయనపై కొరడా ఝుళిపించింది. డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించింది. గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికీ ఈ పరిస్థితే ఎదురైంది. వైకాపా ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరించారనే విమర్శలు ఆయనపై ఉన్నాయి. చంద్రబాబును కలిసేందుకు వెళ్లగా అనుమతి లేదని గేటు వద్దే పోలీసులు ఆయన కారును ఆపారు. దీంతో వేణుగోపాల్‌రెడ్డి వెనుదిరిగారు. మొత్తంగా గతవంలో అతిగా వ్యవహరించిన అధికారుల చిట్టాను దగ్గర పెట్టుకున్న టిడిపి నేతలు చంద్రబాబను కలిసేందుకు రాకుండానే వెనక్కి పంపుతున్నారు.దీంతో వీరికి దిక్కుతోచని స్థితి ఏర్పడింది.

## తెలంగాణపై బిజెపి ప్రత్యేక ఫోకస్

- **కెసిఆర్ అవినీతి, అక్రమాలపైనా దృష్టి**
- **అధికారం లక్ష్యంగా బిజెపి ప్లాన్**

హైదరాబాద్,జూన్6అక్షరం న్యూస్)

బిజెపి తెలంగాణ రాజకీయాలపై గట్టిగానే ఫోకస్ పెట్టనుంది. బిఆర్ఎస్ కనుమరుగు కావడంతో ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసేందుకు కసర్తుత చేసే అవకాశం ఉంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కొంత బలం చాటిని బిజెపి ఇప్పుడు ఎంపి ఎన్నికలతో మరింత బలోపేతంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇక్కడ గెలిచిన 8మంది ఎంపిల్లో మరోమారు ఒకరిద్దరికి మంత్రి పదవులు దక్కే ఛాన్స్ ఉంది. కిషన్‌రెడ్డి గత మంత్రివర్గంలో ఉన్నారు. ఇప్పుడు ఆయనకు ఇస్తారా లేక మరెవరికైనా ఇస్తారా అన్నది చూడాలి. మరోవైపు కెసిఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలన్న పట్టుదల కాంగ్రెస్ , బిజెపి నేతల్లో కనిపిస్తోంది. ప్రభుత్వ ఏజెన్సీలు కూడా కేసీఆర్‌పై నిఘా పెట్టాయని బిజెపి పరోక్షంగా హెచ్చరికలు చేస్తోంది. ఎన్నికలకు ముందు కేసీఆర్ చుట్టూ కేంద్ర పెద్దలు ఉచ్చు బిగిస్తున్నట్లు ప్రచారం చేశారు.

ఇంతకాలం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థలు ఏ క్షణంలోనైనా రంగంలోకి దిగవచ్చుని లీకులు ఇచ్చారు. నీటిపారుదల శాఖకు చెందిన అనుచిత చెల్లింపులకు సంబంధించి నిర్దుష్టమైన ఆధారాలు కేంద్ర ప్రభుత్వ వద్ద ఉన్నాయిన బిజెపి నేతలు బాహాటంగగానే చెబుతున్నారు. జైలుకు పంపుతామని పదేపదే చెబుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ విషయం ఎలా ఉన్నప్పటికీ తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ పట్టుదల ఇప్పుడు మరింతగా పెరిగింది. తమ బలం పెరిగిందన్న ధీమాలో ఉన్నారు. కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయం అని చెబుతున్నారు. ఇకపోతే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. సాధారణ కార్యకర్త సైతం అత్యున్నత పదవిని అందుకోవడం బీజేపీలోనే జరుగుతుందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందని అంటున్నారు. బీజేపీకి కులం, మత భేదాల్లేవని.. పేదరికమే ప్రాథమికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని వెల్లడించారు. ప్రజాధనాన్ని తన కోసం కేసీఆర్ దుబారా చేయడాన్ని ప్రజలు సహించలేదని, అందుకే ఎన్నికల్లో ఓడించారని అన్నారు.

## పంటపెట్టుబడి కోసం ఎదురుచూపు

- **ధాన్యం అమ్మకాల నగదు కోసం ఆరా**

కాకినాడ,జూన్6అక్షరం న్యూస్)

ప్రతీ ఏటా రైతుకు ధాన్యం అమ్ముకోవడం సమస్యగా మారుతోంది. అష్టకష్టాలు పడి రబీ పంట పండించినా ధాన్యాన్ని ఇంకా పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. కొన్న దానికీ పూర్తిగా డబ్బులివ్వలేదు. రబీ పండించిన ధాన్యానికి ఇంకా డబ్బు చేతికి రాకపోతే ఎలా పెట్టుబడి పెట్టగలమని నిలదీస్తున్నారు. జిల్లాలో గోదావరి డెల్టా సిస్టమ్ కింద 75,678 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎత్తిపోతల పథకాలు కింద అంత ఆయకట్టు ఎప్పుడూ సాగవ్వడంలేదు.వాటి అంచనాల్లో నాల్గోవ వంతు కూడా లేదు. ఎక్కువ మంది బోర్ల ద్వారా పంట పండిస్తారు. ఇదంతా సాగులోకి రావాలంటే ఎంత పెట్టుబడి కావాలి. కాలువలకు నీరు విడుదల చేసినంత మాత్రాన ముందస్తు ఖరీఫ్ సాగవ్వదు. ఎందుకంటే కాల్వలకు నీరు నెమ్మదిగా వెళ్లినా, అది పూర్తి స్థాయి నారుమళ్లకు కూడా సరిపోదు.ఈలోపు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటారు. గట్లంకలు వేస్తారు. బోదెలు తవ్వుకుంటారు. ఈలోపు వర్షాలు బాగా వచ్చి తొలకరిస్తే అన్ని పొలాల్లో నీరు ఉంటుంది. రైతులు కూడా ముందుకు వస్తారు. ఈలోపు రైతు చేతిలో పెట్టుబడి సొమ్ము ఉండాలి. రబీ ధాన్యం సొమ్ము అందితే ఉరకలు వేస్తూ ముం దస్తు ఖరీఫ్‌కు వెళతాడు. కానీ ఏదీ. సొమ్మింకా అందలేదు.కొనుగోలు చేసిన 21 రోజుల్లో డబ్బులు వేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ వాస్తవ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. మరి రైతు ఏ విధంగా ఏరువాకకు సిద్ధమవుతాడు. సిద్ధం కావాలంటే అప్పు చేయవలసిందే. రబీ డబ్బుఅంతా అందితే రైతులుఏరువాకకు ఉరకలు వేస్తారు.

## పత్తి సాగుకే రైతులు ఆసక్తి

- **తొలకరి కోసం ఎదురు చూపులు**
- **సోయాతో నష్టాలు వస్తాయన్న భావన**

ఆదిలాబాద్,జూన్6అక్షరం న్యూస్)

ఈ ఏడాది పత్తి పంట సాగు వైపే రైతులు మళ్లీ పరుగులు తీస్తున్నారు.గత అనుభవంతోనే ఈసారి పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. అందుకే పత్తి విత్తనాలకు డిమాండ్ పెరుగుతోంది. గత కొన్నేళ్లుగా సంప్రదాయ పంటల సాగుతో రైతులకు భారీ నష్టాలు వస్తున్నాయని భావించిన ప్రభుత్వం గత ఏడాది నుంచి పత్తి పంట సాగును ప్రోత్సహిస్తూ వస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటలైన సోయా, కంది పంటల సాగు తగ్గుతూ వస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో సోయా, కంది పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ లబోదిబో మంటున్నారు. ఇలాంటి పరిస్థితు ల్లో ఈ ఏడాది పత్తి పంటనే సా గు చేసేందుకు జిల్లా రైతులు అ ధికంగా ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికారులు భావిస్తున్నట్లుగా మిశ్రమ పంటల సాగు విస్తీర్ణం తగ్గి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తుంది.అంచనాలకు మించిన ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఎచ్చుతగ్గుల కారణంగా పత్తి పంటకు ధరలు ఉండవని ప్రచారం జరిగినప్పటికీ గతేడు పత్తి పంటల ధరలు అంచనాలకు మించి ధర పలికింది. పంట చేతికి వచ్చినప్పటి నుంచి కొనుగోలు ముగిసే వరకు మద్దతు ధరను మించిన ధరలేదక్కాయి. తెల్ల బంగారం సిరులు కురిపించడంతో ఈ సారి కూడా రైతులు పత్తి పంటపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 20వేల ఎకరాలకు పై గా పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని అధికారులే చెబుతున్నారు. ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేసి తొలకరి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాధార పంటగా సాగయ్యే పత్తికి జిల్లా వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు నల్లరేగడి భూముల్లో అధిక దిగుబడులు రావడమే అసలు కారణమని రైతులు చెబుతున్నారు.

అధికారులు మాత్రం మిశ్రమ పంటలను సాగు చేస్తేనే మంచి ఫలితా లు వస్తాయని సూచిస్తున్నారు. రైతులు స్వయంగా పత్తి పంటను సాగు చేసిన అనుభవంతోనే ముందుకు సాగుతున్నారు. తొలకరి వర్షాలకే పత్తి పంటను విత్తుతే చీడ పీడల నుంచి తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయని పేర్కొంటున్నారు. వాణిజ్య పంటగా పత్తి పంటతో అప్పులు తీరే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక ఏడాది నష్టం వచ్చిన మరో ఏడాది ఆదుకోకపోతుందా అనే భావనతో పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ధరలు భాగానే ఉన్న పెట్టుబడి ఖర్చులు మరింతగా పెరిగి పోవడంతో లాభాలు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లా సాగు భూమి విస్తీర్ణం 5 లక్ష ల 71 వేల ఎకరాలు కాగా ఈ సారి 3లక్షల 95వేల 200 ఎకరాలలో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గతేడా కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయం గా పెరుగనుంది. మూడు నాలుగేళ్లుగా విస్తీర్ణం తగ్గినా గత ఏడాది ధరలు పుంజుకోవడంతో ఈసారి సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

# అవినీతిపరులను బోను ఎక్కించాల్సిందే !

హైదరాబాద్,జూన్ 6 అక్షరం న్యూస్)

కేంద్రంలో ఎన్‌డిఎ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పడబోతోంది. ఎపిలో కూడా చంద్రబాబు నాయుడు మరోమారు అధికార పగ్గాలు చేపట్టబోతున్నారు. ఈ క్రమంలో ఎన్‌డిఎ ప్రభుత్వం గతం కన్నా మిన్నగా పనితీరు ప్రదర్శించాల్సి ఉంది. ప్రజల సమస్యలపై తఓణం స్పందించాలి. దేశాభివృద్ధికి రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రాలను అభివృద్ధి చేసే క్రమంలో పార్టీలకు అతీతంగా నడుచుకోవాలి. అలాగే అధికారం అడ్డం పెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడి, రాష్ట్రాలను దివాళా తీయించిన నిరంకుశ నేతలను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టి చర్యలు తీసుకోవాల్సిందే. ఈ క్రమంలో ఎపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ అవినీతి అక్రమాస్తుల కేసులు మళ్లీ ముందుకు రానున్నాయి. జగన్ ఇప్పటికే బెయిల్‌పై ఉంటూ రాజ్య మేలారు. అలాగే అనేక అవినీతి కేసుల్లో పీకల్లోతు వరకు మునిగారు. వీటిని తవ్వి తీయడానికి అధికారంలోకి వచ్చే తెలుగుదేశం తప్పకుండా ప్రయత్నం చేస్తుంది. ఇక్కడ తెలంగాణలో కూడా కెసిఆర్ ఫోన్‌ట్యాపింగ్ ప్రకంపనలు సృష్టిస్తోంది. మరోవైపు ఒక్కటంటే ఒక్క ఎంపి సీటు గెలవకపోవడంతో బిఆర్ఎస్ ప్రభ పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఉంటారో..జారుకుంటారో తెలియని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఓటమి పాలయిన మాజీ ముఖ్యమంత్రులకు కేసులను ఎదుర్కోక తప్పని పరిస్థితి రాబోతున్నది. మొన్నటి వరకు ఎన్నికల కోడ్ కారణంగా కొంత స్తబ్దత ఏర్పడింది. జగన్ కూడా అధికారంలో ఉండగా విచ్చలవిడిగా అధికార దుర్వినయోగానికి పాల్పడ్డారు. చంద్రబాబును, ఆయన అనుచరులను వేటాడి వెంటాడారు. ఇవన్నీ చూస్తూ ఊరుకునే కేసులు కావు. ప్రధానంగా ఇసుక, మట్టి మాఫియాలు దోచుకున్నాయి. అలాగే మద్యపాన నిషేధం చేయకపోగా లోకల్ బ్రాండ్లతో వేలకోట్లు దొచారు. వీటన్నటిపైనా టిడిపి శ్రేణులు గత ఐదేళ్లుగా పోరాడుతున్నారు. అనేక కేసులు ఎదుర్కొన్నారు. ఇలాంటి వాటిని చూస్తూ ఊరుకుంటారనడానికి లేదు. అనేక రంగాల్లో అవతవకలు జరిగాయి. భూ ఆక్రమణలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అన్నింటికి మించి వివేకానందరెడ్డి మర్డర్ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు సక్రమంగా సాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేంద్రంలో ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఏర్పడ్డా ఎన్‌డిఎ భాగస్వాములకు ప్రాధాన్యం పెరిగింది. చంద్రబాబుకు కూడా ప్రాధాన్యం మరింతగా పెరిగినట్లే . ఈక్రమంలో అనేక అవినీతి కేసుల్లో చరంద్రబాబు చూస్తూ ఊరుకుంటారనడానికి లేదు. కేంద్రంపై ఒత్తడి తెచ్చికేసుల దర్యాప్తులో వేగం పెంచే అవకాశం ఉంది. అలాగే ఎన్‌డిఎ ప్రభుత్వంలో చేరితే తెలుగుదేశం పార్టీ కీలకమైన మంత్రి పదవులను పట్టుబట్టి తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో కేంద్రంలో కీలకంగా ఉంటారు. ఇకపోతే తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి ఉంది. బిజెపి ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌ను ఇరికించే ప్రయత్నం చేశారన్న విషయంలో బిజెపి ఊరుంటుందనడానికి లేదు. ఇప్పుడు బిఆర్ఎస్‌తో అంటకాగాల్సిన అవసరం కూడా బిజెపికి లేదు. వందల మంది ఫోన్లను ట్యాప్ చేయించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చివరకు రాజకీయంగా అతఃపాతాళానికి తొక్కివేయబడ్డారు. రాజకీయంగా ఇప్పటికప్పుడు చక్రం తిప్పేది లేదు. మరో ఐదేళ్ల వరకు రాజకీయాలు ఎలా ఉంటాయో తెలియదు. అప్పటి వరకు బిఆర్ఎస్ నిలదొక్కుకునేది కూడా కష్టమే. ఉన్న ఎమ్మెల్యేలు కూడా అంటిపెట్టుకుని ఉంటారని కూడా లేదు. ఈ క్రమంలో కేసుల్లో ఇరుక్కోకుండా ఉండేందుకు సాయం చేసేవారు కూడా లేదు. సొంత మనుషులను పరాయివాళ్లలా అనుమానించి దూరం చేసుకున్నారు. ఉద్యమం నాడు వెన్నంటి నడిచిన వారెవరూ ఆయన వెంటలేరు. ఇప్పుడు ఆయనే ఒంటరి అయ్యారు. పార్లమెంట్ ఎన్నికలతో పార్టీ మొత్తంగా దెబ్బతింది. ఒక్కటంటే ఒక్క ఎంపి సీటు గెలవకపోవడం, డిపాజిట్లు కూడా దక్కకపోవడంతో

ప్రజల్లో ఉన్న ఆదరణ కూడా పోయింది. అధికారమంటే బాధ్యత అనే విషయం విస్మరించి, తమకు ప్రత్యర్థులే ఉండకూడదన్న ధోరణితో వ్యవహరించడం వల్లనే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి దాపురించింది. కేసీఆర్ తరహాలో అధికారంతో విర్రవీగిన వారికి ఈ తరహా పతనమే తప్పదని జగన్ కూడా రుజువు చేశారు. కేంద్రంలో మోడీ కూడా ఇదే తరహాలో అధికార ఆధిపత్యం చెలాయించినా..గుడ్డిలో మెల్లలా కూటమితో బయటపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించరాదని మోడీ, జగన్, కెసిఆర్ ల ఉదాహరణలు చెప్పుకోవాలి. బలమైన నాయకులను పక్కన పెట్టుకోగూడదని కోరుకుంటారు. ప్రాంతీయ పార్టీలలో ఈ ధోరణి అధికంగా ఉంటుంది. కేసీఆర్,జగన్ కూడా ఇదే మార్గంలో పయనించి ఇప్పుడు అధికారం కోల్పోయారు. తెలంగాణ ఉద్యమంతో మమేకమై పార్టీని నమ్ముకొని ఉన్నవాళ్లను కాదని ప్రజాబలం లేని వాళ్లను, తనకు వంత పాడే వాళ్లను కేసీఆర్ తన చుట్టూ నింపుకొన్నారు. ఫలితంగా బలమైన నాయకులు దూరమయ్యారు. ప్రజాబలం లేకపోయినా కేసీఆర్ మనసెరిగి వ్యవహరించడం ద్వారా లాభపడుతూ వచ్చిన వాళ్లు ఇప్పుడు ఒక్కొక్కరుగా ఆయనను విడిచి వెళ్లిపోయారు. ఎన్‌డిఎ పక్షాలకు ఇంకా కొంచె ఎక్కువ సీట్లు వచ్చి, బిజెపికి తక్కువ సీట్లు వచ్చివుంటే మోడీ పరిస్థితి కూడా రివర్స్ అయ్యేది. కానీ అదృష్టంకొద్దీ మోడీ బయట పడ్డారు. మోడీ కూడా తన విధానాలను సమీక్షించుకోవాలి. ప్రజలు మెచ్చే పాలన అందించే ప్రయత్నం చేయాలి. ప్రజలు పడుతున్న బాధలను తెలుసుకుని వాటి పరిష్కరానికి పనిచేయాలి. ఎన్‌డిఎ పక్షాలు ఇప్పుడు కీలక భూమిక పోషించాలి. రాష్ట్రాల్లో విచ్చలవిడిగా వ్యవహరించి, అప్పుల కుప్ప చేసిన రాష్ట్రాలను గాడిలో పెట్టాలి. రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. ప్రజలకు అవసరమైన పనుల విషయాలో రాజకీయాలను పక్కన పెట్టాలి. ఉమ్మడి ఎజెండాకు అనుగుణంగా, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగాలి. అలాగే అవినీతికి పాల్పడ్డ నేతలను బజారులో నిలబెట్టాల్సిందే. అవినీతి, అధికార దుర్వినియోగం చేసిన వారిని ఉపేక్షించరాదు.

కెసిఆర్ లేదా, జగన్‌లు ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని లేచి నిలబడే ప్రయత్నం చేస్తే భవిష్యత్తు ఉండవచ్చు. కానీ వారి వ్యవహార శైలి మార్చుకోకపోతే ప్రయోజనం ఉండదు. ప్రాంతీయ వాదంతో కేసీఆర్ ఇంత కాలం రాజకీయాల్లో రాణించారు. కానీ సెంటిమెంట్‌తో ఇక రాజకీయాలు చేయడం సాధ్యం కాదు. అధికారంలో ఉన్నప్పుడు మీడియాను భయపెట్టి లొంగదీసుకున్నారు. మీడియాను కూడా దూరం చేసుకోవడంతో వారు కూడా కెసిఆర్‌కు దూరం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పీఎస్సార్ ఆంజనేయులు, రఘురామి రెడ్డి, రవిశంకర్ రెడ్డి, రిషాంత్ రెడ్డి వంటి వాళ్లు అన్ని రకాల పరిధులను అతిక్రమించి వ్యవహరించినట్టు వార్తలు వస్తున్నాయి. హద్దులు దాటి ప్రవర్తించే అధికారులు ఎప్పటికైనా మూల్యం చెల్లించుకోవలసిందే!

# రాష్ట్రాన్ని గాడిలో పెట్టడమే తక్షణ కర్తవ్యం

- కూటమి ప్రభుత్వంతో ముందుకు సాగాల్సిందే
- మంత్రి పదవుల విషయంలో పట్టువిడుపులు ఉండాల్సిందే
- కత్తిమీద సాములా చంద్రబాబు నాయుడు పరిస్థితి



అమరావతి, జూన్6అక్షరం న్యూస్)

రాష్ట్రంలో టిడిపి కూటమి అతికొద్ది రోజుల్లోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు, అప్పులను తేర్చడం కూడా అంతే కష్టం కానుంది. దీనికితోడు ఇప్పుడు ఉమ్మడి ప్రభుత్వాన్ని నడపాల్సి ఉంటుంది. ప్రభుత్వంలో జనసేన,

బిజెపిలు భాగస్వామిగా ఉంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం, మంత్రి పదవులను కేటాయించడం కత్తిమీద సాములాంటిదే. టిడిపిలో ఉన్న కొందరిని పక్కన పెడితే తప్ప బిజెపి, జనసేనలకు పదవులు ఇవ్వడం కుదరదు. అలాగే టిడిపిలో ఉన్న వారు కూడా చంద్రబాబు తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి నడుచుకుంటేనే ఎపిలో నిర్ణయాలు సక్రమంగా ఉంటాయి. సిఎంగ ఆచంద్రబాబు ప్రమాణ స్వీకారం చేనున్న సందర్భంగా మంత్రివర్గంలో స్థానం కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. టిడిపి, జనసేన, బిజెపి సభ్యులతో ఉమ్మడిగా క్యాబినెట్ ఏర్పాటవుతుందనే చర్చ జరుగుతోంది. మంత్రులుగా 25 మందికి అవకాశం ఉంది. వీటిలో పార్టీల వారీగా ఎన్ని అనేది తేలాల్సి ఉంది. సమర్థుడైన వ్యక్తిని స్పీకర్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. గతంలో ఉమ్మడి ఎపిలో స్పీకర్‌గా పనిచేసిన అనుభవం జనసేన ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌కు ఉంది. ఆయన కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. టిడిపి నుంచి మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు పేరు మాత్రం మొదటి వరుసలో ఉంది. ఆయనకు గతంలో లానే ఆర్థిక, న్యాయ శాఖలు అప్పగించే అవకాశం ఉంది. 2019 నుండి 2024 వరకూ అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులుగా కీలకపాత్ర పోషించిన వారికి తొలి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఉమ్మడి జిల్లాల వారీగా చూసుకుంటే శ్రీకాకుళం జిల్లా నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇద్దరిలో ఒకరికి ఇచ్చే అవకాశం ఉంది. విజయనగరం నుంచి మాజీ మంత్రులు కిమిడి కళా వెంకట్రావు, కె మురళీమోహన్, ఆర్‌విఎస్‌కెకె రంగరావు, అదితి గజపతిరాజు ఆశిస్తున్నట్లు తెలిసింది. విశాఖపట్నం నుంచి వంగలపూడి అనిత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి మాజీమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు రేసులో ఉన్నారు. పశ్చిమ గోదావరి నుంచి పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, పితాని సత్యనారాయణ, ఉమ్మడి కృష్ణా నుంచి కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి లో ఇద్దరిలో ఒకరికి, గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వర రావు, మైలవరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పోటీపడుతున్నారు. గుంటూరు నుంచి రేప్లలె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మహిళా కోటాలో గుంటూరు పశ్చిమ నుండి భారీ మెజార్టీతో గెలిచిన గల్లా మాధవి రేసులో ఉన్నారు. ప్రకాశం నుంచి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కొండెపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో బాల వీరాంజనేయస్వామి గత అసెంబ్లీలో తన వాణిని వినిపించారు. నెల్లూరు జిల్లా నుంచి మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, పి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల పేర్లు రేసులో ఉన్నాయి. ఈ జిల్లాకు రెండు మంత్రి పదవులు ఖాయంగా దక్కుతాయని చెబుతున్నారు. కడప జిల్లా నుంచి కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, కర్నూలు జిల్లా నుంచి టిజి భరత్, మైనార్టీ కోటాలో ఎన్‌ఎండి ఫరూక్, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా నుంచి ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రేసులో ఉన్నారు. చిత్తూరు నుంచి పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమర్‌నాథ్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. పిఠాపురం సీటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు త్యాగం చేసిన వర్మకు ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశం ఉంది. కూటమిలో మిత్రపక్షాలైన జనసేన, బిజెపి పార్టీల నుంచి కూడా మంత్రి పదవులు కోరుతున్న ఆశావహులు

ఎక్కువగానే ఉన్నారు. జనసేన నుంచి తెనాలి నుంచి గెలిచిన ఆ పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, అనకాపల్లి నుంచి గెలిచిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్, రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ పేర్లు వినిపిస్తున్నాయి. బిజెపి నుంచి విజయవాడ పశ్చిమ నుంచి గెలిచిన సుజనా చౌదరి, అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి గెలిచిన సత్యకుమార్, జమ్మలమడుగు నుంచి గెలిచిన ఆదినారాయణ రెడ్డి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, విశాఖపట్నం ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్లు వినిపిస్తున్నాయి. యితే జిల్లాల వారీగా కాకుండా అనుభవం, అర్హతలను బట్టి మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరిని నిర్దయగా పక్కన పెట్టాల్సి ఉంటుంది. ఎపి పునర్నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాల్సి ఉన్న క్రమంలో మంత్రి పదవులు పెద్దగా పట్టింపు కారాదు.

# ముందురోజు టీమిండియా ఓడిపోయినట్లు కల వచ్చింది

### ప్రపంచకప్ ఫైనల్‌పై రోహిత్ కామెంట్స్!

హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)

వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్‌లో భారత్ ఓడిపోయిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించి కప్‌ను కైవసం చేసుకుంది. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీని సొంతం చేసుకునే అవకాశం భారత జట్టుకు తృటిలో చేజారింది. దాంతో టీమిండియా క్రికెటర్స్ అందరూ ఫైనల్ ఓటమిని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా కెప్టెన్ రోహిత్ శర్మ. ఇప్పటికే పలుమార్లు ప్రపంచకప్ ఫైనల్ ఓటమిపై స్పదించిన హిట్‌మ్యాన్.. తాజాగా మరోసారి ఆ చేదు జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు. వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఓటమి తనను అప్పుడప్పుడు కలవరానికి గురి చేస్తోందని రోహిత్ తెలిపాడు. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్‌లో ఓటమి తర్వాత రోజు ఉదయం వచ్చిన కల గురించి తన భార్య రితికాకు చెప్పిన విషయాన్ని రోహిత్ శర్మ గుర్తు చేసుకున్నాడు. 'ప్రపంచకప్ ఫైనల్ తర్వాత రోజు ఉదయం నిద్ర లేచా. ఆ రాత్రి టీమిండియా ఓడిపోయినట్లు కల వచ్చింది. 'ఆ కలే నిజమవుతుందా?. రేపు కదా మనం ఫైనల్ మ్యాచ్ ఆడాల్సింది' అని పక్కనే ఉన్న రితికాతో అన్నా. కాసేపటికి అసలు విషయం గ్రహించా. నిన్ననే కదా మ్యాచ్ అయిందని గుర్తొచ్చింది. 4-5 రోజుల పాటు ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయా.






నాలుగేళ్ల తర్వాతే మళ్లీ వన్డే ప్రపంచకప్ ఆడే అవకాశం వస్తుందనుకున్నా' అని హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ చెప్పాడు.'వన్డే ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ వరకు మేం వరుస విజయాలు సాధించాం. అప్పటివరకు సరైన దారిలోనే ఉన్నాం. కప్ అందుకొనేందుకు చేరువగా వచ్చామని అంతా భావించారు. కానీ ఫైనల్‌లో అనూహ్యంగా ఓడిపోయాం. అహ్మదాబాద్‌లో ఉండేందుకు నా మనసు అస్సలు అంగీకరించలేదు. త్వరగా ప్రెసెంటేషన్ కార్యక్రమం ముగించి వెళ్లిపోదామనుకున్నా. తీవ్ర నిరాశలో ప్రతి భారత క్రికెటర్ ఉన్నాడు. జీవితంలో ఏం జరుగుతుందో కూడా ఆ సమయంలో అర్థం చేసుకోలేం. అంతటి కోపం, నిరాశ ఎదురయ్యాయి' అని రోహిత్ భావోద్వేగానికి గురయ్యాడు. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్ 2024ను భారత్ ఘనంగా ప్రారంభించింది. ఐర్లాండ్‌ను చిత్తుగా ఓడించి మంచి ఊపులో ఉంది.

# ఎప్పుడూ 50 కంటే తక్కువ పరుగులు చేయలేదు



హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)

ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన చూపించిన కింగ్ విరాట్ కోహ్లీ.. టీ20 వరల్డ్ కప్‌లో మొదటి మ్యాచ్‌లోనే నిరాశపరిచాడు. మంచి ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లీపై.. టీమిండియ భారీ ఆశలు పెట్టుకుంది. ఈ క్రమంలో.. నిన్న ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్?లో కోహ్లీ ఓపెనర్?గా బరిలోకి దిగాడు. కానీ.. అనుకున్నంత స్థాయిలో ఆడలేక అభిమానులను నిరాశపరిచాడు. కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి ఔటయ్యాడు. అది కూడా.. పెద్ద టీమ్ బౌలర్లు కూడా కాదు.. పసికూన ఐర్లాండ్ బౌలర్లకే కోహ్లీ తడబడ్డాడు. 5 బంతులు ఆడిన కోహ్లీ.. మార్క్ అడైర్ ఓవర్‌లో క్యాచ్ రూపంలో ఔట్ అయ్యాడు. టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఛేజింగ్‌లో విరాట్ కోహ్లీ 50 కంటే తక్కువ పరుగులు సాధించడం 8 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. 2016లో న్యూజిలాండ్‌పై జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ 23 పరుగులు చేశాడు. ఆ తర్వాత ఎప్పుడూ 50 కంటే తక్కువ పరుగులు చేయలేదు. అయితే.. ఐపీఎల్ లో అదరగొట్టి, ఇప్పుడు బెదరగొడుతున్నందుకు ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ట్రోఫీని ఎలాగైనా సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్న టీమిండియాతో పాటు అభిమానులు.. గేర్ మార్చాలని అంటున్నారు. కోహ్లీ బ్యాటింగ్ రికార్డు విషయానికొస్తే.. టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో అద్భుతంగా ఉంది. ఛేజింగ్‌లో అతడి సగటు ఏకంగా 180.66గా ఉంది. టీ20 వరల్డ్ కప్‌లో ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ 542 పరుగులు సాధించాడు. అందులో 7 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 82 పరుగులు చేశాడు. స్ట్రైక్ రేట్ 134.49గా ఉండగా.. 49 ఫోర్లు, 14 సిక్సర్లు ఉన్నాయి. కాగా.. ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ 2024కప్ న్యూయార్క్‌లో జరుగుతుంది. బుధవారం రాత్రి నసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్ లో టీమిండియా ఘన విజయం సాధించింది. భారత్ బౌలర్లు చెలరేగడంతో.. టీమిండియా 8 వికెట్ల తేడాతో ప్రపంచ కప్‌లో బోణీ కొట్టింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ కేవలం 96 పరుగులకే ఆలౌట్ అయింది. కెప్టెన్ రోహిత్ శర్మ హాఫ్ సెంచరీ, రిషబ్ పంత్ రాణించడంతో భారత్ అలవోక విజయం సాధించింది.

## బోణి కొట్టిన ఆసీస్.. ఒమన్ పై భారీ విజయం



హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)

2024 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా తన మొదటి మ్యాచ్ ను గెలిచింది. గురువారం ఒమన్‌తో బార్బడోస్ లో జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో ఆసీస్ 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. మార్కస్ స్టోయినిస్ (67 నాటౌట్‌బీ 36 బంతుల్లో) అలాగే బౌలింగ్ లో (3-0-19-3) విధ్వంసక నాక్ తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చివేసింది. దాంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు పొందాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. డేవిడ్ వార్నర్ (56బీ 51 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), స్టోయినిస్ అర్ధశతకం సాధించారు. మెహ్రాన్ ఖాన్ రెండు వికెట్లు తీశాడు. అయితే ఆసీస్ మొదట చాలా నెమ్మదిగా స్కోర్ ను సాధించారు. 12 ఓవర్లలో 63/3 మాత్రమే చేసింది. ఆ తర్వాత స్టోయినిస్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. బౌండరీలు, సిక్సర్లతో రెచ్చిపోయాడు. మెహ్రాన్ ఖాన్ వేసిన 15వ ఓవర్లో నాలుగు సిక్సర్లతో 26 పరుగులు చేశాడు. అతను తన అర్ధ సెంచరీ 27 బంతులతో చేశాడు. మరోవైపు వార్నర్ జాగ్రత్తగా ఆడుతూ అతనికి మద్దతుగా నిలిచాడు. అతను తన అర్ధ సెంచరీని 46 బాల్స్ లో చేశాడు. స్టోయినిస్ వార్నర్ నాలుగో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరి కారణంగానే ఆసీస్ చివరి 8 ఓవర్లలో 101 పరుగులు చేసింది. అనంతరం ఒమన్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 129 పరుగులు మాత్రమే చేసింది. అయాన్ ఖాన్ (36బీ 30 బాల్స్) టాప్ స్కోరర్. స్టోయినిస్‌కు మూడు వికెట్లు దక్కాయి. స్టార్క్, ఎల్లిస్, జంపా చెరో రెండు వికెట్లు తీశారు. ఒమాన్ ఆరంభం నుంచే ఒకదాని తర్వాత ఒకటి వికెట్లు కోల్పోయింది. ఒక దశలో 57 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఆ సమయంలో మెహ్రాన్ ఖాన్ (27బీ 16 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లు) కొట్టడంతో ఓటమిని కాస్త తగ్గించాడు.

# భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు భారీ అడ్డంకి!



హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)

టీ20 వరల్డ్ కప్-2024ను భారత్ ఘనంగా ఆరంభించింది. న్యూయార్క్ వేదికగా నాసా కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియంలో బుధవారం ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ మన బౌలర్ల ధాటికి 16 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. హార్దిక్ పాండ్య (3/27), బుమ్రా (2/6), అర్షదీప్ సింగ్ (2/35) సత్తాచాటారు. అనంతరం భారత్ 12.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రోహిత్ శర్మ (52బీ 37 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకం సాధించాడు. రిషభ్ పంత్ (36 నాటౌట్, 26 బంతుల్లో, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించాడు. గ్రూప్-ఏలో భాగంగా భారత్ తదుపరి మ్యాచ్‌ను ఆదివారం పాకిస్థాన్‌తో ఆడనుంది. అయితే ఈ మ్యాచ్ వేదిక మార్చాలని డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. జూన్ 9న జరగాల్సిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు నాసా కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియమే ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే ఇక్కడి డ్రాప్ ఇన్ పిచ్‌లపై అస్థిర బౌన్స్ లభిస్తుంది. బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా కష్టపడుతున్నారు. అంతేగాక బ్యాటర్లకు గాయాలవుతున్నాయి. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ రిటైర్ హర్ట్‌గా వెనుదిరగడానికి పిచ్‌యే కారణం. అస్థిర బౌన్స్ వల్ల హిట్ మ్యాన్ భుజానికి గాయమైంది. ఈ నేపథ్యంలో న్యూయార్క్‌లోని పిచ్‌లు చాలా ప్రమాదకరమని మాజీ క్రికెటర్లు సైతం పేర్కొంటున్నారు. "అమెరికాలో క్రికెట్‌ను ప్రోత్సహించాలని భావిస్తున్నాం, కానీ ఈ పిచ్‌లు ఆటగాళ్లకు ఎంతో ప్రమాదం. ఈ పిచ్ కచ్చితంగా మంచిది కాదు" అని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. ప్రముఖ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందిస్తూ.. "పిచ్‌లకు ఏమైనా చేయండి. ఇలాంటి దానిపై భారత్-పాక్ మ్యాచ్‌ను ఊహించుకోవడం కష్టం" అని అన్నాడు. అస్థిర బౌన్స్ లభిస్తూ, ఆటగాళ్లకు ప్రమాదకరంగా పిచ్ ఉంటే అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేసే అవకాశాలు ఉంటాయి. ఇటీవల బిగ్ బాష్ లీగ్‌లో ఓ మ్యాచ్‌ను పిచ్ కారణంగానే రద్దు చేసిన విషయం తెలిసిందే. గిలాంగ్ లోని సైమండ్స్ స్టేడియంలో మెల్ బోర్న్ రెనిగేడ్స్ - పెర్త్ స్కార్చర్స్ మధ్య జరిగిన మ్యాచ్ 6.5 ఓవర్ల అనంతరం రద్దు చేస్తూ ప్రకటించారు. భారత్-పాక్ మ్యాచ్‌లోనూ ఇలాంటి ఘటనే జరుగుతుందేమో అని అభిమానులు టెన్షన్ పడుతున్నారు. అయితే ఈ హైవోల్టేజ్ మ్యాచ్‌కు ఇప్పటివరకు ఉపయోగించని పిచ్‌ను ఉపయోగించనున్నారు. అది ఎలా సహకరిస్తుందో తెలియాలంటే ఆదివారం వరకు ఎదురుచూడాల్సిందే.

## 43 ఏళ్ల వయసులో ఉగాండ ప్లేయర్ చరిత్ర సృష్టించాడు


హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)

ఉగాండ ప్లేయర్ ఫ్రాంక్ న్సుబుగా సంచలన రికార్డు నమోదు చేశాడు. 43 ఏళ్ల వయసులో చరిత్ర సృష్టించాడు. టీ20 ప్రపంచకప్-2024లో అత్యంత పెద్ద వయస్కుడిగా రికార్డులకెక్కిన ఫ్రాంక్ చరిత్రలో నిలిచేలా అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేశాడు. గయనా వేదికగా పపువా న్యూ గినియాతో జరిగిన మ్యాచ్‌లో ఉగాండ మూడు వికెట్ల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పపువా న్యూ గినియా 19.1 ఓవర్లలో 77 పరుగులకు ఆలౌటైంది. హిరి హిరి (15బీ 19 బంతుల్లో, 2 ఫోర్లు), లెగా సియాక (12బీ 17 బంతుల్లో, 1 ఫోర్), కిప్లిన్ (12బీ 20 బంతుల్లో, 1 సిక్సర్) మినహా మిగిలనెవరూ రెండంకెల స్కోరు అందుకోలేదు. ఉగాండ బౌలర్లలో అల్పేష్ రంజానీ, కాస్మస్, జుమా మియాగీ, ఫ్రాంక్ న్సుబుగా తలో రెండు వికెట్లు తీశారు. 43 ఏళ్ల న్సుబుగా నాలుగు ఓవర్లలో కేవలం నాలుగు పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. రెండు ఓవర్లు మెయిడిన్ చేశాడు. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఇదే అత్యంత ఉత్తమ ఎకానమీ (1.00) బౌలింగ్ ఇదే. అంతకుముందు ఈ రికార్డు దక్షిణాఫ్రికా బౌలర్ బార్ట్‌మన్ (2.25) పేరిట ఉండేది. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. ఛేదనలో ఉగాండ 18.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. అయితే ఉగాండ ఆదిలోనే పీకల్లోతు కష్టాల్లో పడింది. 26 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. రియాజత్ అలీషా (33బీ 56 బంతుల్లో, 1 ఫోర్), జుమా మియాగీ (13బీ 16 బంతుల్లో)తో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 35 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఉగాండకు ఇదే తొలి విజయం కావడం విశేషం. కాగా, ఉగాండ-పపువా న్యూ గినియా మ్యాచ్ ఓ అరుదైన రికార్డు నమోదుచేసింది. టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లో అత్యంత తక్కువ రన్ రేటు నమోదైన మ్యాచ్‌గా రికార్డులకెక్కింది. ఈ మ్యాచ్‌లో 4.13 రన్‌రేటుతో పరుగులు నమోదయ్యాయి.

## డకౌట్ల రారాజుగా మాక్స్‌వెల్.. చెత్త రికార్డు!

హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)

ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ గ్లెన్ మాక్స్‌వెల్ ఐపీఎల్‌లో తన చెత్త ఫామ్‌ను టీ20 వరల్డ్ కప్‌లోనూ కొనసాగిస్తున్నాడు. ఐపీఎల్-2024లో మాక్సీ దారుణంగా విఫలమైన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో అయిదు సగటుతో 52 పరుగులే చేశాడు. పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమించిన మాక్స్‌వెల్‌ను ఆర్సీబీ అయిష్టంగానే తుదిజట్టులో కొనసాగించింది. ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పే సామర్థ్యం ఉన్న అతడు కాసేపు క్రీజులో ఉన్నా జట్టుకు ప్రయోజనకరమే అని భావించి బరిలోకి దించింది. కానీ ఒక్క మ్యాచ్‌లో కూడా అంచనాలు అందుకోలేకపోయాడు. అయితే ఆర్సీబీ తరఫున విఫలమవైనా ఆస్ట్రేలియా కోసం మాక్సీ చెలరేగి ఆడుతాడని భావించారంతా. కానీ అతడు మరోసారి అంచనాలను తలకిందులు చేశాడు. బార్బడోస్ వేదికగా గురువారం ఒమన్‌తో జరిగిన గ్రూప్-బీ మ్యాచ్‌లో ఖాతా తెరవకముందే పెవిలియన్‌కు చేరాడు. ఒక్క బంతే ఎదుర్కొని గోల్డెన్ డకౌటయ్యాడు. దీంతో కలిపి గత పది ఇన్నింగ్స్‌ల్లో మాక్సీ పది సార్లు డకౌటవ్వడం గమనార్హం. అయితే ఈ క్రమంలో మాక్స్‌వెల్ చెత్త రికార్డు నమోదు చేశాడు. మెన్స్ టీ20 క్రికెట్‌లో అత్యధిక సార్లు డకౌటైన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో సునీల్ నరైన్ (44), అలెక్స్ హేల్స్ (43), రషీద్ ఖాన్ (33), గ్లెన్ మాక్స్‌వెల్ (33), పాల్ స్టిర్లింగ్ (32) టాప్-5లో ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సార్లు డకౌటైన చెత్త రికార్డు మాక్స్‌వెల్ పేరిట ఉన్న విషయం తెలిసిందే. లీగ్‌లో మాక్సీ 18 సార్లు డకౌటయ్యాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. ఒమన్‌పై ఆస్ట్రేలియా 39 పరుగుల తేడాతో గెలిచింది. ఆల్‌రౌండ్ షోతో సత్తాచాటిన మార్కస్ స్టోయినిస్ (67 నాటౌట్‌బీ 36 బంతుల్లో, 2 ఫోర్లు, 6 సిక్సర్లు), (3-0-19-3)కి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో అయిదు వికెట్లకు 164 పరుగులు చేసింది. డేవిడ్ వార్నర్ (56బీ 51 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్సర్), స్టొయినిస్ అర్ధశతకాలు సాధించారు. మెహ్రన్ ఖాన్ రెండు వికెట్లు తీశాడు. అనంతరం ఛేదనలో 20 ఓవర్లలో ఒమన్ తొమ్మిది వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. అయాన్ ఖాన్ (36బీ 30 బంతుల్లో, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్.



# నేడు విడుదలవుతున్న మనమే

హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)
టాలీవుడ్ యువ కథానాయకుడు శర్వానంద్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. కెరీర్ ప్రారంభం నుంచే 'గమ్యం', 'యువసేన', 'అమ్మ చెప్పింది', 'వెన్నెల' సినిమాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకున్నాడు. అయితే ఈ నటుడికి ఇప్పటికి తెలుగులో బిరుదు లేదన్న విషయం తెలిసిందే. తాజాగా తన కొత్త సినిమా ఈవెంట్‌లో తన బిరుదును ప్రకటించారు మేకర్స్. శర్వానంద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మనమే' . ఈ సినిమాకు శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తుండగా.. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రం జూన్ 7న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడటంతో ప్రమోషన్స్ షురూ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చిత్ర బృందం హైదరాబాద్‌లో బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ వేడుకకు టాలీవుడ్ దర్శకులు మారుతి, శివ నిర్వాణ, సాయి రాజేశ్‌లతో పాటు తదితరులు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై చిత్రం మంచి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు.




## కంగనా చెంప వాయించిన మహిళా పోలీస్

**ఫిర్యాదుతో అదుపులోకి తీసుకున్న అధికారులు**

చండీగఢ్,జూన్6 అక్షరం న్యూస్) బాలీవుడ్ నటి, లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన కంగనా రనౌత్ కు చేదు అనుభవం ఎదురైంది. చండీగఢ్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ ఆమెను చెంపదెబ్బ కొట్టారు. ఈ షాకింగ్ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గురువారం మధ్యాహ్నం దిల్లీకి బయల్దేరిన కంగన.. విమానం ఎక్కేందుకు చండీగఢ్ విమానాశ్రయంలో బోర్డింగ్ పాయింట్‌కు వెళ్తుండగా ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సాగు చట్టాల్ని నిరసిస్తూ దిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేపట్టిన రైతుల్ని అగౌరవ పరిచేలా నటి చేసిన వ్యాఖ్యలే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని తెలుస్తోంది. కంగన ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మండి సీటు నుంచి భాజపా అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కంగన స్పందించారు. తాను బాగానే ఉన్నట్లు పేర్కొంటూ ఓ వీడియోను విడుదల చేశారు. సెక్యూరిటీ చెకింగ్ వద్ద ఈ ఘటన జరిగినట్లు చెప్పారు. సెక్యూరిటీ చెకింగ్ పూర్తయి పాస్ కోసం వేచి చూస్తుండగా.. సెక్యూరిటీ మహిళా ఆఫీసర్ తన వైపు వచ్చి కొట్టడంతో పాటు తనను దూషించారన్నారు. ఇందుకిలా చేశావని అడగ్గా.. రైతులకు మద్దతుదారు అని ఆమె చెప్పినట్లు కంగన తెలిపారు. తాను క్షేమంగానే ఉన్నానని.. కాకపోతే పంజాబ్‌లో ఉగ్రవాదం, హింసను ఎలా ఎదర్కోవాలనే అంశంపైనే ఆందోళనగా ఉందన్నారు. మరోవైపు, దిల్లీ చేరుకున్న అనంతరం కంగన సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్, ఇతర సీనియర్ అధికారుల్ని కలిసి ఈ ఘటన గురించి వివరించారు. దీంతో దీనిపై దర్యాప్తు చేసేందుకు బృందాన్ని ఏర్పాటు చేసిన అధికారులు.. కుల్విందర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించేందుకు సీఐఎస్ఎఫ్ కమాండెంట్ కార్యాలయానికి తరలించారు.

# మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో సందడి







- అన్నయ్య ఆశీర్వాదం తీసుకున్న పవన్ కళ్యాణ్
- పాదాభివందనం చేసి ఆలింగనం చేసుకున్న తమ్ముడు
- కేక్ కట్‌చేసి..బాణాసంచాతో స్వాగతించిన మెగా ఫ్యామిలీ

హైదరాబాద్,జూన్6 (అక్షరం న్యూస్)
మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో జనసేన విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. తమ్ముడు గెలవడంతో కుటుంబం అంతా ఆనందలో మునిగితేలింది. పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు మెగాస్టార్ చిరంజీవి ఘన స్వాగతం పలికారు. తమ్ముడు పవన్ అన్న చిరంజీవి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. చిరు కూడా తమ్ముడిని ఆలింగనం చేసుకుని అబినందించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ లోని చిరంజీవి నివాసానికి తన భార్య, కొడుకుతో కలిసి పవన్ వెళ్లారు. ఈ సందర్భంగా పవన్‌కు మెగా ఫ్యామిలీ గ్రాండ్ వెల్‌కమ్ చెప్పింది. ఎమ్మెల్యేగా గెలిచాక తొలిసారి పవన్, చిరంజీవి దగ్గరకు వచ్చారు. పవన్ కు పూలమాల వేసి గ్రాండ్ వెల్ కమ్ చెప్పారు చిరంజీవి. కేక్ కట్ చేసి మెగా ఫ్యామిలీ సెలబ్రేట్ చేసుకున్నారు. జనసేన కార్యకర్తులు, అభిమానులు పెద్ద ఎత్తున చిరంజీవి నివాసానికి చేరుకుని టపాసులు కాల్చారు. ఈ సెలబ్రేషన్స్ కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. జూన్ 4న మంగళవారం వెలువడిన ఏపీ ఎన్నికల ఫలితాల్లో జనసేన పార్టీ 100 శాతం స్ట్రైక్ రేటుతో పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాలు, 2 లోక్ సభ స్థానాల్లో ఘన విజయం సాధించింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఈ ఎన్నికల్లో 164 అసెంబ్లీ స్థానాలతోపాటు 21 ఎంపీ సీట్లను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. కూటమి విజయంలో పవన్ కల్యాణ్ కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో నాగబాబు కూడా పాల్గొన్నారు.



## ప్రధాని మోడీతో పవన్ భేటీ


**కుమారుడు అకీరా నందన్ పరిచయం**

న్యూఢిల్లీ,జూన్6(అక్షరం న్యూస్)
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి జయకేతనం ఎగురవేయడమే గాకుండా.. జనసేన పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ ఘన విజయాన్ని సాధించింది. ఈ క్రమంలో ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. తాజాగా జరిగిన ఎన్డీయే కూటమి నేతల సమావేశానికి తన కుటుంబంతో సహా హాజరయ్యారు. సతీమణి అన్నాలెజినోవా కొణిదెలతో పాటు తన కుమారుడు అకీరా నందన్‌ను సైతం దిల్లీకి తీసుకెళ్లారు. కూటమి నేతల భేటీ ముగిసిన అనంతరం ప్రధాని మోదీకి తన కుటుంబాన్ని పరిచయం చేశారు. ఈసందర్భంగా అకీరా ప్రధాని మోదీకి నమస్కరిస్తుండగా అతడి భుజంపై చేయి వేసి మోదీ మాట్లాడుతున్న ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. ఎన్నికల ఫలితాలు ముగిసిన అనంతరం పవన్‌కల్యాణ్‌కు ఆయన సతీమణి హారతి ఇస్తున్న వీడియోలోనూ వెనక అకీరానే కనిపించాడు. ఆ తర్వాత తెదేపా అధినేత చంద్రబాబు వద్దకు వెళ్లినప్పుడు పవన్.. అకీరాను తీసుకెళ్లారు. చంద్రబాబుకు పరిచయం చేయడమే కాకుండా, ఆయన కాళ్లకు నమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకోమని సూచించారు. ఫలితాల రోజున ఆ ఫొటోలు విపరీతంగా వైరల్ అయ్యాయి.



## కాంచన-4ను అనౌన్స్ చేసిన లారెన్స్

హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)
తమిళం నుంచి వచ్చిన బ్లాక్ బస్టర్ హారర్ చిత్రాలలో కాంచన ఫ్రాంచైజీ ఒకటి. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు దర్శకుడు రాఘవ లారెన్స్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రాలు సూపర్ హిట్ అందుకున్నాయి. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీలో ముని, కాంచన 2, కాంచన 3 చిత్రాలు వచ్చి మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు తాజాగా ఈ ఫ్రాంచైజీ నుంచి కాంచన 4ను అనౌన్స్ చేశారు రాఘవ లారెన్స్. ఈ సందర్భంగా పోస్టర్‌ను కూడా విడుదల చేశాడు. ఇక రాఘవ లారెన్స్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్నట్లు ప్రకటించారు. 2025 సమ్మర్‌లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు.



## పవన్ ప్రయాణంపై అకీర వీడియో

### రేణూదేశాయ్ విడుదలతో వైరల్



హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)
ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ అఖండ విజయాన్ని సాధించడంతో మెగా ఫ్యామిలీ అంతా సంతోషంగా ఉంది. ఈ నేపథ్యంలో పవన్ కుమారుడు అకీరా ఎడిట్ చేసిన వీడియోను రేణూ దేశాయ్ పంచుకోగా వైరల్‌గా మారింది. నెటిజన్లంతా కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'కొన్ని వారాల క్రితం వాళ్ల నాన్న కోసం అకీరా నందన్ చేసిన ప్రత్యేక వీడియో ఇది. పవన్‌పై తనకున్న ప్రేమకు ఇది నిదర్శనం. తన తండ్రి విజయంపై అకీరా ఎంతో ఆనందంగా, గర్వంగా ఉన్నాడు' అని రేణు దేశాయ్ దీనికి క్యాప్షన్ పెట్టారు. 'ఖుషి' నుంచి 'భీమ్లానాయక్' వరకు పవన్ చేసిన సినిమాల్లోని పవర్‌ఫుల్ డైలాగులతో దీన్ని ఎడిట్ చేశారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతుండగా 'గూస్‌బంప్స్ వస్తున్నాయంటూ' నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ చేస్తున్నారు. 'ఎమ్మెల్యే గారి అబ్బాయి చేసిన వీడియో బాగుంది' అని ఒకరు కామెంట్ చేయగా.. 'ఇప్పటి వరకు చూసిన వాటిల్లో ఇదే బెస్ట్ వీడియో' అని మరో అభిమాని పేర్కొన్నారు.

## విజయ్ దేవరకొండతో సాయిపల్లవి



హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)
విజయ్ దేవరకొండతో సాయిపల్లవి స్క్రీన్ షేర్ చేసుకోబోతోంది. సాయిపల్లవి సినిమాల విషయంలో వేగం పెంచింది. ప్రస్తుతం ఆమె తెలుగులో 'తండేల్' చేస్తూనే హిందీలో రెండు భారీ ప్రాజెక్ట్‌లు చేస్తోంది. అలాగే తమిళంలో 'అమరన్'లో నటిస్తోంది. అయితే ఇప్పుడామె కొత్తగా మరో కథ విన్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ హీరోగా రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. దీన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నారు. అందమైన ప్రేమకథతో రూరల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానున్న ఈ చిత్రం కోసం నాయికగా సాయిపల్లవిని ఖరారు చేసేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆమెతో కథా చర్చలు పూర్తయ్యాయని.. సినిమా విషయంలో ఆమె సానుకూలంగా ఉందని సమాచారం. దీన్ని వచ్చే ఏడాది సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## డబుల్ ఇస్మార్ట్ పూర్తిలో రామ్




హైదరాబాద్,జూన్6 అక్షరం న్యూస్)
టాలీవుడ్ నటుడు ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రస్తుతం ఒక మంచి కంబ్యాక్ కోసం ఎదురుచూస్తున్నాడు. అప్పుడెప్పుడో ఇస్మార్ట్ శంకర్‌తో హిట్ కొట్టిన రామ్‌కి మళ్లీ సరైన హిట్ పడలేదు. ఈ మధ్య బోయపాటి డైరెక్షన్‌లో వచ్చిన స్కంద కూడా బాక్సాఫీస్ వద్ద అట్టర్ ఎ÷-లాప్‌గా నిలిచింది. ఈ సినిమా అనంతరం స్టార్ దర్శకుడు పూరీ జగన్నాథ్‌తో రామ్ డబుల్ ఇస్మార్ట్ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే వరుస ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతున్నాడు రామ్. ఇప్పటికే హరిశ్ హరీష్ శంకర్‌తో ఒక సినిమా చేయబోతున్న రామ్ మరోవైపు నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి డిజిటల్ ఎంట్రీకి రెడీ అవుతున్నాడు. ఇక ఇవి కాకుండా మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను రామ్ లైన్‌లో పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్‌తో రామ్ సినిమా చేయబోతున్నట్లు తెలుస్తుంది. హరీష్ శంకర్ ప్రస్తుతం మిస్టర్ బచ్చన్ షూటింగ్‌లో బిజీగా ఉండడంతో ఈ గ్యాప్‌ను రామ్ త్రివిక్రమ్‌తో ప్లాన్ చేయనున్నట్లు తెలుస్తుంది. రామ్ సోంత నిర్మాణ సంస్థ స్రవంతి బ్యానర్ లోనే ఈ ప్రాజెక్టు ఉంటుందని సమాచారం. త్వరలోనే ఈ విషయానికి సంబంధించిన క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## జిల్లాలో జీలుగు విత్తనాల కొరత లేదు

**- రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి**
**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల**



**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ జూన్.06 /అక్షరం న్యూస్:** జిల్లాలో రైతులకు కావలసిన వివిధ పంట విత్తనాలు సాగు విస్తీర్ణం ఆధారంగా విత్తన పరిమాణం అంచనా వేసి సరిపడు విధంగా స్టాక్ అందుబాటులో పెట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రైతులకు కావలసిన పచ్చిరొట్ట విత్తనాలు 60 శాతం రాయితీపై అందజేయపడుతున్నాయని, వ్యవసాయ అధికారులు ఇచ్చే టోకెన్ల ద్వారా రైతులు పాక్స్ సెల్ పాయింట్ కి వెళ్లి జిలుగు విత్తనాలు పొందాలని తెలిపారు. చంద్రుగొండ మండలానికి 350 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు కేటాయించగా ఇప్పటివరకు 224.70 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీలుగు విత్తనాలు దేశంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి రావాల్సి ఉండుటవలన మనకు విత్తనాలు రావడానికి సమయం తీసుకుంటుంది అంతేగాని జీలుగు విత్తనాల కొరత ఏమాత్రం లేదు అని కలెక్టర్ తెలిపారు. రాయితీపై అందించే విత్తనాలు మొలక శాతం పరీక్షించిన తర్వాతే రైతులకు ఇవ్వడం జరుగుతుందని, ఈ క్రమంలో సమయాభావం వలన జీలుగు విత్తనాలు రైతులకు అందజేయడంలో సమయం పడుతుందని తెలిపారు. చంద్రుగొండ మండలానికి అదనంగా కావలసిన 150 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు రవాణాలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

## మాల మహానాడు ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శిగాతీకుట్ల మొగిలి నియామకం



**జ్యోతి నగర్ జూన్ 6 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:** కమాన్ పూర్ మండలం పేరపెల్లి గ్రామానికి చెందిన టీకుట్ల మొగిలి మాల మహానాడు ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. రెండు దశాబ్దాలుగా దళిత జాతి ఐక్యత అభ్యున్నతి కోసంచేస్తున్న కృషిని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకెళ్తూ ముఖ్యంగా మాల జాతి కోసం పనిచేస్తూ గతంలో జిల్లా కార్యదర్శిగా పనిచేసిన తీకుట్ల మొగిలినీ రాష్ట్ర కార్యదర్శిగా తీసుకుంటూ మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ పసుల రామ్మూర్తి. రాష్ట్ర అధ్యక్షులు జూపాక సుధీర్. పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు డాక్టర్ దేవి లక్ష్మీనరసయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.. మాలల హక్కుల కోసం పోరాడుతానని దళిత జాతి అభ్యున్నతి కోసం ముందుకెళతానని రాష్ట్ర కార్యదర్శి తీకుట్ల మొగిలి తెలిపారు.

## సీడ్స్ విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



**గద్వాల్ జిల్లా/అయిజ మండలం/జూన్06/అక్షరం న్యూస్:** మండల పరిధిలో విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అలంపూర్ తాలూకా టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని కోరమండల్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు ఒరిజినల్ రసీదులు తప్పనిసరిగా అందజేయాలని డీలర్లకు సూచించారు. రైతులకు నకిలీ విత్తనాలను అంటగడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు ఒరిజినల్ రసీదులు తప్పనిసరిగా అందజేయాలని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో శంకర్ లాల్,హెడ్ కానిస్టేబుల్ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్స్ అందేలా చూడాలి

**- జోనల్ బిజినెస్ హెడ్ ఉదయ్ శంకర్**



**కరీంనగర్, తిమ్మాపూర్ జూన్ 06 (అక్షరం న్యూస్):** ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్స్ అనేది తప్పకుండా ఉండాల్సిన అవసరం ఉందని కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ జోనల్ బిజినెస్ హెడ్ ఉదయ్ శంకర్ అన్నారు. కరీంనగర్ జ్యోతి నగర్ లోని ఓ ప్రైవేట్ బంకెట్ హాల్లో గురువారం హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్లతో ఏజెంట్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏజెంట్లకు హెల్త్ ఇన్సూరెన్స్ అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత నిత్య జీవితంలో హెల్త్ ఇన్సూరెన్స్ అనేది ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమని తెలిపారు. ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా అత్యవసరంగా హెల్త్ ఇన్సూరెన్స్ అనేది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దానిని ప్రజలకు తెలియజేసి వాటిని వారు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని సూచించారు. అనంతరం కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ లో ప్రతిపా కనబరిచిన ఏజెంట్లకు పత్రాలు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ బిజినెస్ హెడ్ శేఖర్ సీనియర్ ఏరియా హెడ్ సురేష్ బాబు, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ రాకేష్ జెట్టి, వేణుగోపాల్, సాగర్ మరియు ఏజెంట్లు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడుగా ముచ్చకుర్తి శ్రీనివాస్



**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జూన్ 06 అక్షరం న్యూస్:** మున్నూరు కాపు మండల అధ్యక్షుడుగా కల్వచర్ల గ్రామానికి చెందిన ముచ్చకుర్తి శ్రీనివాస్ నియమించినట్లు గురువారం రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ముచ్చకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మున్నూరు కాపు సామాజిక అభివృద్ధికి పాటుపాడుతానని, త్వరలోనే గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ మున్నూరు కాపుల హక్కుల కొరకు పోరాడుతానని పేర్కొన్నారు.

# ప్రసూతి మరణాలను తగ్గించాలి

**- ప్రసూతి మరణాలను నివారించడానికి సూరక్షితమైన మాతృత్వ సేవలు మెరుగు పరచాలి...**
**- డాక్టర్ శ్రీనివాస్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్...**



**మహబూబాబాద్ /గార్ల /జూన్ 6/అక్షరం న్యూస్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఐ డి ఓ సి లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి అద్యక్షతన మహబూబాబాద్ జిల్లాలో గత సంవత్సరము ఏప్రిల్ నుండి ఈ సంవత్సరము మార్చి వరకు జిల్లాలో జరిగిన 12 మాతృ మరణాలపైన జిల్లాలలోని మెడికల్ ఆఫీసర్ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిదిగా విచ్చేసి మాట్లాడుతూ, ప్రసూతి మరణం అనేది గర్భవతిగా ఉన్నప్పుడు లేదా గర్భం ముగిసిన 42 రోజులలోపు, తీవ్రతరం కాబడిన ఏదైనా కారణంతో మరణించిన మహిళ (లేదా బాలిక) మరణమును మాతృ మరణము అంటారని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీ ఇంటి వద్ద గాని, రెఫరల్ హెల్త్ ఫెసిలిటీ వద్ద లేదా ప్రసూతి కొరకు తీసుకొని వెలుతున్నప్పుడు మార్గ%శీ% మద్యలో గాని సంభవించే ప్రతి ప్రసూతి మరణాన్ని 24 నుండి 48 గంటలలోపు తెలియజేయాలని మరియు సమీక్షించబడాలని ఆయన తెలిపారు.
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి మాట్లాడుతూ ఒక గర్భిణీ తను గర్భం దరించిన వెంటనే కుటుంబ సభ్యులకు తెలియచేసి దగ్గరలోని ఆరోగ్య కార్యకర్త వద్ద నమోదు చేయుంచుకోని క్రమం తప్పకుండా డాక్టర్లతో పరీక్షుంచుకొని వారు చెప్పిన సూచనలు సలహాలు పాటించడం వలన ప్రసూతి మరణాలను నివారించవచ్చని, ప్రసూతి మరణ సమీక్ష యొక్క ముఖ్య ఉద్దేశ్యం భవిష్యత్తులో ప్రసూతి మరియు నవజాత శిశువుల అనారోగ్యం మరియు మరణాలను నివారించడానికి సురక్షితమైన మాతృత్వ సేవల నాణ్యతను మెరుగుపరచడం మరియు నాణ్యమైన ప్రసూతి మరియు నవజాత ఆరోగ్య సేవలను పొందడంలో భవిష్యత్తులో లోపాలను నివారించడానికి చర్యలను గుర్తించవచ్చని ఆమె పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ వెంకట్రాములు మాట్లాడుతూ గర్భం మరియు ప్రసవ సమయంలో ప్రతి సంవత్సరం అర మిలియన్ మంది మహిళలు మరణిస్తున్నారని అంచనా వేయబడిందని మరియు ప్రసవ సమయంలో జీవించి ఉన్న మరో 7o మిలియన్ల మంది మహిళలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం తెలుస్తుందని, ప్రసూతి మరణ సమీక్ష వల్ల ఆరోగ్య సిబ్బంది, మరియు కుటుంబాలు ఒక విషాదకరమైన మరియు తరచుగా నివారించదగిన మరణాలను ఏ విదంగా అరికట్ట వచ్చో నేర్చుకునే అవకాశాన్ని అందిస్తుందని ఆయన పేరుకొన్నారు. ఈ సమీక్షాసమావేశం లో డిప్యూటీ డిఎంహెచ్ఓ లు అంబరీష, డాక్టర్ మురళీధర్, ప్రోగ్రాం అధికారులు, డాక్టర్ బిందుశ్రీ, డాక్టర్ నాగేశ్వర్ రావు, డాక్టర్ సుధీర్ రెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విద్య, గూడూర్ సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న, డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్, ప్రసాద్, హెల్త్ ఎడ్యు కేటర్ లు, మహేందర్ రెడ్డి, పురుషోత్తమ్, కేవి రాజు, గీత, ఇన్ చార్జ్ డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ, ఎన్హెచ్ఎం డిపిఓ రుక్మద్దీన్ . ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యదికారులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డేమాన్‌లో వైభవంగా శనీశ్వర స్వామి జయంతోత్సవం

**- శనీశ్వర స్వామి వారు గ్రహాలలో న్యాయాధిషుడు.**



**నాగర్ కర్నూల్ జూన్ 6 ( అక్షరం న్యూస్):** వైశాఖ అమావాస్య రోజును శనేశ్వర జయంతి గా పరిగణిస్తారని, నవగ్రహాలలో శనీశ్వర స్వామి న్యాయాధిషుడిగా వ్యవహరిస్తారని నందీశ్వర శనేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి తెలిపారు.బిజినపల్లి మండల పరిధిలోని వడ్డమాన్ గ్రామంలో గురువారం అమావాస్య రోజు శాస్త్రోక్తంగా శనేశ్వర జయంతి ఉత్సవం నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజామున స్వామి వారికి ప్రత్యేకంగా వేదమంత్రాలతో శనేశ్వర హెూమం,తిల అభిషేక పూజలు నిర్వహించారు. జన్మ రిత్యా గోచార రీత్యా శని గ్రహదోష పరిహారము నివృత్తి కొరకు జమ్మి చెట్టు సమిధలతో హెూమాన్ని, శనేశ్వర మూలమంత్రాన్ని అర్చక స్వాములచే 19వేలసార్లు జపించారు. ఈ క్రోధి నామ సంవత్సరంలో శనీశ్వర స్వామి వారు మంత్రిగా వ్యవహరిస్తున్నారని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా కాపాడాలని ప్రత్యేక పూజలు చేశారు. జన్మరత్యా గోచార రీత్యా ఏలినాటి,అర్ధాష్టమ, అష్టమ శని దోష పరిహారానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శిశించుకుని ప్రత్యేకంగా తిలతైల అభిషేక పూజలలో పాల్గొన్నారు.శనేశ్వర స్వామి ప్రభావంతో వివాహం ఆలస్యమగుట,వృత్తి లో సమస్యలు,వ్యాపార అభివృద్ధి లేకపోవడం,శారీరక ఆరోగ్య సమస్యలు ఏర్పడడం,ఆర్థిక నష్టం,తీవ్రఅప్పులు,మానసిక ఒత్తిడికి గురికావడం,అనేక బాధలు కలగడం,వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు.గ్రహబాధలు తోలుగుటకు శనేశ్వర స్వామిని శక్తి మేరకు పూజించాలని, మంత్ర జపం జపిస్తూ దోష పరిహార పొందాలన్నారు.ఈ అమావాస్య రోజు గ్రహ కూటమి ఏర్పడిన సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మసూత్రం గల పరమశివుని దర్శించి అభిషేకాలు అర్చనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వి. గోపాలరావు కమిటీ సభ్యులు వీరశేఖర్, ఆలయ అర్చకులు ఉమ్మయ్య,విశ్వరాధ్య, జయంత్ కుమార్,సిబ్బంది గోపాల్ రెడ్డి వివిద ప్రాంతాల చెందిన భక్తులు మహిళలు పాల్గొన్నారు.

# తాటిచెట్లు నరికినవారిపై కేసు నమోదు చేయాలి

**- మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ డిమాండ్.**
**- ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డికి మోకుదెబ్బ ఆధ్వర్యంలో పిర్యాదు.**



**వరంగల్ జిల్లా/ నర్సంపేట డివిజన్/ జూన్ 6 అక్షరం న్యూస్:** దుగ్గొండి మండలం పొనకల్ గ్రామంలో తాటిచెట్లు అక్రమంగా నరికిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు నర్సంపేట ఆబ్కారి సిఐ. నరేష్ రెడ్డికి మోకుదెబ్బ ఆధ్వర్యంలో గురువారం పిర్యాదు చేశారు. అనంతరం రమేష్ గౌడ్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల కులాలలో గౌడ కులస్తుల వృత్తి అత్యంత ప్రమాదకరమైనదన్నారు.నిరంతరం చస్తూ బతుకుతున్న గౌడ్ వృత్తి సంబంధమైన తాటి, ఈత చెట్లను అభివృద్ధి పేరుతో, రోడ్డు వెడల్పు, చెరువు కట్టల మరమ్మత్తుతో విచ్చల విడిగా నరికి వేస్తున్నారని ఆరోపించారు.దీనికి తోడు గ్రామీణ ప్రాంతంలో ఇష్టారాజ్యాంగ ప్రభుత్వం బెల్టు షాపులకు అనుమతులు ఇవ్వడం వల్ల గౌడ్ లకు కల్లు అమ్ముకునే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పాలకుల స్వార్థపూరిత ఆలోచన వల్ల కల్లుగీత పరిశ్రమ ఉనికి లేకుండా పోయిందని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల సమయంలోనే పాలకులకు గౌడ కులస్తులు గుర్తుకు వస్తారని, అనంతరం మరచిపోతున్నారన్నారు.తాటిచెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిచో పెద్ద ఎత్తున గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని రమేష్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గంప రాజేశ్వర్ గౌడ్, మద్దెల సాంబయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జూలూరి హరిప్రసాద్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గండి గిరిగౌడ్, పట్టణ ఉపాధ్యక్షులు గుండెబోయిన కోటిగౌడ్ , దుగ్గొండి మండలం అధ్యక్షులు తడుక కొమురయ్య గౌడ్, ఉపాధ్యక్షులు గుండెబోయిన రమేష్ గౌడ్,ఎంపిటీసీ బండి జగన్నాదం గౌడ్,గౌడ సంఘం సీనియర్ నాయకులు బొమ్మగాని సదానందం గౌడ్, పొనకల్ గౌడ సంఘం అధ్యక్షులు పిల్లల సురేష్ గౌడ్, ఉపాధ్యక్షులు బండి రాజయ్య గౌడ్, బొట్టు పెద్ద మనిషి బొమ్మగాని రవీందర్ గౌడ్,బొమ్మగాని రాజయ్య గౌడ్ మాజీ అధ్యక్షులు,కార్యదర్శి బొమ్మగాని సుధాకర్ గౌడ్, డైరెక్టర్ లు గాజర్ల బుచ్చయ్య గౌడ్,బురగాని సుమన్ గౌడ్, బొమ్మగాని సారంగపాణి గౌడ్, బండి గావాస్కర్ గౌడ్, మడిపెల్లి వినయ్ గౌడ్, ముత్యాల వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు బడి వద్దు, ప్రభుత్వ బడి ముద్దు..

**- ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్**
**- మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలి**
**- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్: ప్రియాంక అల**




**భద్రాద్రి జిల్లా/ పాల్వంచ /జూన్.06/ అక్షరం న్యూస్:** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం పాల్వంచ మండలంలోని పీయం శ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రారంభోత్సవ ర్యాలీలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన్ కలెక్టర్ . ప్రైవేటు బడి వద్దు, ప్రభుత్వ బడి ముద్దు ,అమ్మ ఒడి- ప్రభుత్వ బడి అనే నినాదాలతో శాస్త్రి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. శాస్త్రి రోడ్లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేసి, ప్రభుత్వ బడుల్లో కల్పించే సదుపాయాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

**నూతన హంగులతో విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలుకుతాం: జిల్లా కలెక్టర్**

6నుండి 19 వరకు జరిగే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా, ప్రతి ఇంటికి వెళ్లి విద్యార్థుల వివరాలను, వాళ్ళు చదువుతున్న పాఠశాలల వివరాలను తెలుసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేశామని, నూతన హంగులతో విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలుకుతామని కలెక్టర్ తెలిపారు. జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ముందే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.
మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని దానికి తల్లిదండ్రులలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అంగన్వాడి టీచర్లు, ఆయాలు తమ కేంద్రంలోని పిల్లల తల్లిదండ్రులు కు ప్రభుత్వ పాఠశాలలో కల్పించే సదుపాయాలపై అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ విద్యాచందన, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర చారి, జిల్లా సంక్షేమ అధికారి విజేత, జిల్లా విద్యా శాఖ కోఆర్డినేటర్, పాల్వంచ ఎం.పి.డిఓ, ఎంఈఓ, ఏఎం.ఎన్.ఓ, మున్సిపల్ కమీషనర్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## చీకట్లో ఎన్టిపిసి సిఐఎస్ఎఫ్ కాలనీ..

**- గాలి వానలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

**జ్యోతి నగర్ జూన్ 6 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్ :**
రామగుండం ఎన్టీపీసీ కి చెందిన సిఐఎస్ఎఫ్ కాలనీ తో పాటు టెంపరరీ టౌన్షిప్ లో గాలి వానలకే విద్యుత్ సరఫరా నిలిచిపోయి కాలనీవాసులు రెండు రోజులు చీకట్లోనే ఉంటున్నామని వాపోతున్నారు. ఎన్ టి పి సి కి చెందిన సబ్ స్టేషన్ నుండి సిఐఎస్ఎఫ్ కాలనీ, టి టి ఎస్ కాలనీకి విద్యుత్ సరఫరా చేసే లైన్లలో చీటికిమాటికి చిన్నపాటి గాలి వానలకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుందని దీనిని మరమ్మతు చేసి పునరుద్ధరించడంలో జాప్యం జరగడంతో సిఐఎస్ఎఫ్ కాలనీకి బుధ గురువారం రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా టెంపరరీ టౌన్షిప్ పనులు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయి కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు, సబ్ స్టేషన్ లను, విద్యుత్ లైన్లను సరియైన వార్షిక మరమ్మతులు చేపట్టకపోవడం వల్లనే చిన్నపాటిగాలి వాన లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వాపోతున్నారు, కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా ఎన్ టి పి సి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

## నర్సంపేట నియోజకవర్గ పత్రిక సమావేశంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ జిల్లా/నర్సంపేట డివిజన్ /జూన్ 6 అక్షరం న్యూస్:**



మహబూబాద్ పార్లమెంట్, నర్సంపేట నియోజకవర్గం లో జిల్లా నాయకులు రాణా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో లోక్ సభ బిజెపి అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ తో కలిసి పాల్గొన్న వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ... నర్సంపేట నియోజకవర్గం లో భారతీయ జనతా పార్టీ గతంతో పోల్చుకుంటే ఓటు బ్యాంకులో ఎంతో పురోగతిని సాధించినట్లు తెలుస్తోంది. ఆరు నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికలలో 3 వేల లోపు ఓట్లు సాధించగా ఈ పార్లమెంట్ ఎన్నికలలో ఎండలు సైతం లెక్కచేయకుండా భారత ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో 24 వేల పైన ఓట్లను సాధించిన ప్రతి ఒక్క నాయకుడికి కార్యకర్తలకి కృతజ్ఞతలు తెలియజేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీలలో నర్సంపేట నియోజకవర్గానికి అత్యధిక ఓట్లు బిజెపికి వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీ నర్సంపేట నియోజకవర్గం లో విజయం సాధిస్తుందని వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. ఇదేవిధంగా నియోజకవర్గంలోని ప్రతిఒక్క నాయకుడు, కార్యకర్తలు కృషి చేస్తే రానున్న మండల స్థాయి లో జడ్పిటిసి, ఎంపీటీసి లు గ్రామస్థాయి సర్పంచుల ఎన్నికలలో బిజెపి సత్తా చాటుతుందని అన్నారు. ఈ పత్రిక సమావేశంలో వరంగల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ వడ్డేపల్లి నరసింహులు, మహబూబాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ రామ్ చందర్ రెడ్డి, నర్సంపేట పట్టణ కౌన్సిలర్లు, నియోజకవర్గ మండల ఇన్చార్జీలు, అధ్యక్షులు, బీజేవైఎం నాయకులు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## అద్దెకు ఉన్న ఇంట్లోనే దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్

**- బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న కొత్తగూడెం 2టౌన్ పోలీసులు**

**భద్రాద్రి జిల్లా/ చుంచుపల్లి/ జూన్.06/ అక్షరం న్యూస్:**



అద్దెకు ఉన్న ఇంట్లోనే దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్దనుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు కొత్తగూడెం 2టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సి.ఐ రమేష్ పేర్కొన్నారు. ఫిబ్రవరి నెల 2023లో కొత్తగూడెం 2టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్.సి.బి నగర్ నందు నివాసముండే మనోహర్ బాబు అనే వ్యక్తి తన యొక్క ఇద్దరు పిల్లలు ఒకరు అమెరికాలో మరియు ఒకరు బెంగళూరులో ఉండడంతో వృద్ధ దంపతులు ఇంటి వద్దనే ఉన్నారు. వారి ఇంటి పై భాగంలోని పోర్షన్లో మహావీర్ అనే వ్యక్తి కుటుంబముతో సహా గత నాలుగు సంవత్సరాలుగా అద్దెకు వుంటున్నారు. వీరు అట్టి వృద్ధ దంపతులతో స్నేహంగా, సన్నిహితంగా ఉంటూ వారి ఇంటికి వేసే రెండవ తాళం యొక్క తాళపు చెవిని దొంగిలించారు. వారు ప్రతి రోజు గుడికి పూజకు వెళ్తారని భావించి రాత్రి పూట వారు గుడికి వెళ్ళిన సమయంలో వారికి అనుమానం రాకుండా సదరు మహావీర్ ఆ ఇంటి యొక్క తాళం తీసి వారి ఇంటిలోని బీరువాలో ఉన్న సుమారుగా 117 గ్రాముల బంగారు ఆభరణాలైన నక్లెస్ మరియు చైను మరియు నాలుగు గాజులు దొంగిలించి వాటిని తన ఇంట్లో దాచిపెట్టుకున్నాడని, మిత్రుడు మనోహర్ బాబు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పై అంతస్తులో కిరాయికి ఉన్న మహావీర్ అనే వ్యక్తి ఆ ఇంటిలో దొంగతనం చేశాడని, అట్టివస్తులను ఈ రోజు తను అమ్మడానికి వెళుతున్న క్రమంలో పోలీసులు చాకచక్యంగా గోధుమ వాగు బ్రిడ్జి వద్ద పట్టుకొని అతన్ని విచారించగా దొంగతనం చేసింది తానే అని ఒప్పుకోగా అతని వద్ద నుంచి ఒక బంగారు ఆభరణాలను రికవరీ చేసి అతని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపించడం జరిగింది. ఇట్టి సొమ్ము విలువ 7,60,000/-రూపాయలు ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో ఎస్.ఐ., కానిస్టేబుళ్లు ఉన్నారు.

## డాక్టర్ శీలం పాపారావుకు పితృ వియోగం ..

**- శీలం రామచందర్ పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ రవికుమార్**

**ఖమ్మం /తల్లాడ జూన్ 6 (అక్షరంన్యూస్):**



భారతీయ జనతా పార్టీ నాయకుడు , ప్రముఖ డాక్టర్ శీలం పాపారావు ( సర్జన్ ) తండ్రి శీలం రామచందర్ గురువారం ఖమ్మంలో మృతి చెందారు. పలువురు ప్రముఖులు రామచందర్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు . లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ ,వీర నారీమణుల ఆశయ సాధన సమితి గౌరవాధ్యక్షులు షేక్ నజీమా , జిల్లా అధ్యక్షులు భూక్య ఉపేంద్ర బాయి , ప్రధాన కార్యదర్శి మామిడాల ఝాన్సీ , టీ జే ఎస్ జిల్లా నాయకులు జంగిపల్లి రవి , ప్రముఖ వైద్యులు రవి లు భౌతిక కా యాన్ని సందర్శించి , నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఎల్ హెచ్ పి ఎస్ , ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ,వీరనారి మణుల ఆశయ సాధన సమితి నాయకులు చందు ,జ్యోతి , శ్వేత , పెదపాక నాగభూషణం , జయ ,జగదీష్ ,వీరన్న , జంగిపల్లి మహేష్ తదితరులు ఉన్నారు.

# నిరుపేదలకు జీవనోపాధి కల్పించిన చంద్ర చిరస్మరణీయుడు

**- ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన నాటి నేతలు ఆదర్శం సిపిఐ జిల్లా కార్యదర్శి : ఎస్.కె.సాబీర్**
**- ఘనంగా చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి**




**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం /జూన్.06/ అక్షరం న్యూస్ :** దేశంలో భూపోరాటాలకు శ్రీకారం చుట్టి నిరుపేదల జీవనోపాధి కల్పించిన చంద్ర రాజేశ్వరరావు చిరస్మరణీయుడని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అన్నారు. సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్రావు 110వ జయంతిని గురువారం శేషగిరిభవన్లో ఘనంగా నిర్వహించారు. తొలుత సిఆర్ చిత్ర పఠానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్ మాట్లాడుతూ జమీందారి కుటుంబంలో జన్మించి కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితుడై తన యావదాస్తిని పేదలకు పంచిన మహానీయుడని కొనియాడారు. పేదలకు భూమి దక్కితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించిన సిఆర్ దేశవ్యాప్త భూపోరాటాలకు నాందిపలికాడన్నారు. మహిళలపై దాడులు, అరాచకాలను అరికట్టేందుకే, ఉద్యమాలను అనిచివేతను పూనుకుంటున్న ప్రభుత్వాలకు అడ్డుకట్ట వేసేందుకు ఉద్యమాల్లో పాల్గొనే ప్రజలకు రక్షణ కల్పించేందుకే ఆరు దశాబ్దాల క్రితమే జనసేవాదళ్ ను ఏర్పాటు చేసిన ముందు చూపు ఉన్న మహానేత అని కొనియాడారు. రోజురోజుకు పెరుగుతున్న అంతరాలు, మనోన్మాదం దేశానికి ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన నాటి నేతలను ఆదర్శంగా తీసుకొని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసుఎల్లయ్య, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, నాయకులు బత్తుల సురేష్, జహీర్, గుత్తుల శ్రీను, ఇర్ఫాన్, యాకూబ్, పున్నంసింగ్, సోమయ్య, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి గెలుపు పట్ల నాయకుల సంబరాలు





**- రామగుండం అసెంబ్లీలో 57 వేల కాంగ్రెస్ మెజారిటీ ని కేవలం 6 నెలల్లో 10 వేలకు తగ్గించడం లో కందుల సంధ్యారాణి కీలక పాత్ర**

**జ్యోతి నగర్ జూన్ 6 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:** దేశవ్యాప్తంగా బిజెపి అధికారంలోకి రావడం రామగుండం నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు రావడం పట్ల రామగుండం బిజెపి నాయకులు గురువారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో సంబరాలు చేసుకున్నారు బీజేపీ కి వచ్చిన ఓట్లు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చాయి అని మండల అధ్యక్షులు కందుల సంధ్యారాణి కి సన్మానం చేసి గోదావరిఖని చౌరస్తా లో బాణసంచా కాల్చి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో స్వీట్లు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. ఆరు నెలల్లో రామగుండం నియోజకవర్గంలోనే కాకుండా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపికి అత్యధిక ఓట్లు రావడం పట్ల బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. రామగుండంలో ఓట్లు పెరగడానికి కందుల సంధ్యారాణి కృషి కూడా ఉందని సీనియర్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ శ్రీరాముడిలా మోడీ మా వెన్నంటి ఉండగా రాముని బంటుల్లాగా ప్రతి గడపగడపకి కార్యకర్తలు కాషాయ సైన్యం వలె ఉధృతంగా ప్రచారంలో పాల్గొన్నారు దాని ఫలితమే ఈ ఓట్లు. ఆరు నెలల్లో అధికారంలో ఉన్న పార్టీ ప్రజలకు భరోసా ఇచ్చే ఏ పథకం అమలు చేయకపోవడం మాకు పెద్ద లాభాన్ని చేకూర్చింది. అది కాంగ్రెస్ మీద వ్యతిరేకతను పెంచి తెరాస వైపు మరలకుండా బిజెపి వైపు ప్రజలు చూసేలా చేయడంలో ఇంతటి విజయం సాధించడానికి కృషి చేసిన సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, మండల ఇన్చార్జిలు, బూత్ అధ్యక్షులు, బూత్ కోఆర్డినేటర్, బూత్ ఏజెంట్లు ముఖ్యంగా కార్యకర్తలు నా ధన్యవాదములు. దాదాపు 65 బూతులలో కాంగ్రెస్ కంటే బీజేపీకి ఎక్కువ ఓట్లు పడ్డాయి. ఈ ఉత్సాహంతో ఇంకా పెద్ద ఎత్తున పనిచేయడానికి ప్రేరణ కలిగింది. రేపటి నుండి మా కార్యాచరణ పూర్తిగా ప్రభుత్వ పథకాల అమలుపై, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగుతుంది అని కందుల సంధ్యారాణి ఉద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హన్మంతు గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గాండ్ల ధర్మపురి, సీనియర్ నాయకులు సుల్వ లక్ష్మీనర్సయ్య, కోమల మహేష్, తోట కుమార స్వామి, పార్లిమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ సుమంత్ పటేల్, అసెంబ్లీ కో ఆర్డినేటర్ కొండపర్తి సంజీవ్ మండల అధ్యక్షులు కోడూరి రమేష్, గుండబోయిన భూమయ్య, కొమ్ము గట్టయ్య, బాణాల స్వామి, నవీన్ గౌడ్, మిట్టపల్లి సతీష్ కార్యకర్తలు మెరుగు నరేష్, మెరుగు శ్రీనివాస్, గంధ అజయ్, దాసరి ఉషాలు, మామిడి వీరేశం, రాజ్ కుమార్, అపర్ణ, సంపూర్ణ, పవన్, మహేందర్, శ్రీనివాస్ యాదవ్ మరియు బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

# రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలి...

**- మాదంశెట్టి నాగేశ్వరరావు, సిపిఐ (ఎమ్ -ఎల్ ) న్యూ డెమోక్రసీ, మైదాన మండల కమిటీ కార్యదర్శి.**



**మహబూబాబాద్ /గార్ల /జూన్ 6/అక్షరం న్యూస్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్క కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, కూలి వేతనం రోజుకు రు.600 రూపాయలు చెల్లించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మైదాన మండల కమిటీ కార్యదర్శి మాదంశెట్టి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీన బయ్యారం మండల కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ గొల్లగూడెం, నర్సాతండా గ్రామాల పరిధిలో ఉన్న ఉపాధి కూలీల పని ప్రదేశం వద్ద కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని ఉద్దేశించి మాదంశెట్టి నాగేశ్వరావు మాట్లాడుతూ,

ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో దేశవ్యాప్తంగా తీసుకువచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని,కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గిస్తూ, ఈ పథకానికి తూట్లు పొదుస్తుందని ,దీనివల్ల అన్ని దినాల తగ్గింపు కానీ, పూర్తిగా రద్దు చేయడం గాని జరుగుతుందని, పనిచేసినా డబ్బులు చెల్లింపులు ఉండదని వారు విమర్శించారు. పని ప్రదేశం వద్ద సరైన సౌకర్యాలు, వసతులు కల్పించడం లేదని వారు తెలిపారు. పనిచేసే వారికి పారలు, గడ్డపారలు అందించకుండా నిర్లక్ష్యం చేస్తుందనివారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసే చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని, ఈ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం మండల నాయకులు గుండెబోయిన లింగముల్లు, హన్మ,శేషు, పి డి ఎస్ యు నాయకులు నేతకాని రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టిపిసి తెలంగాణ ప్రాజెక్టు రెండవ దశకు మోక్షం..






**- 800 మెగావాట్ల మూడు యూనిట్లకు టెండర్లు జారి.. ఆరు సంవత్సరాల్లో పూర్తి**

**జ్యోతి నగర్ జూన్ 6 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :** ఎన్ టి పి సి రామగుండం పక్కన మొదటి దశ కింద 8 00 మెగావాట్ల రెండు యూనిట్లు తెలంగాణ థర్మల్ పవర్ స్టేషన్ పేరిట ఎన్టిపిసి నిర్మించగా.. రెండవ దశ కింద 800 మెగావాట్ల మరో మూడు యూనిట్ల నిర్మాణానికి ఎన్టిపిసి టెండర్లు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయినా ఎన్ టి పి సి 4వేల మెగావాట్లు నిర్మించి ఇవ్వాలని చట్టం చేశారు. ఈ మేరకు 2016 నుంచి 2023 వరకు 800 మెగావాట్ల రెండు యూనిట్ల నిర్మాణం పూర్తి చేసుకొని ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు ఈ రెండు యూనిట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు కేవలం తెలంగాణ రాష్ట్రానికి అందజేస్తారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం మరో 2400 మెగావాట్ల యూనిట్ల నిర్మాణం కోసం ఎన్టిపిసి సిద్ధంగా ఉన్నప్పటికీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. యాదాద్రి లాంటి స్థలంలో నిర్మించాలని కోరగా ఎన్టిపిసి నిరాకరించింది మళ్లీ భూసేకరణ సమస్య ఇలాంటివి తలెత్తుతాయని అంతేగాక బొగ్గు రవాణాకు దూరం అవుతుందని కారణాలు చెప్పడంతో అక్కడే ఆగిపోయింది. తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ మూడు యూనిట్ల నిర్మాణం పై ఆశలు చెలరేగాయి ఎన్టిపిసి కూడా నిర్మాణానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే పవర్ పరీక్షలు అగ్రిమెంట్ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించింది. ఆరు సంవత్సరాల తర్వాత విద్యుత్తు యూనిట్ రేట్ ఎక్కువగా ఉండడంతో రాష్ట్ర క్యాబినెట్ ఆసక్తి చూపలేదు. అంతేకాకుండా సోలార్ పవర్ కూడా అందుబాటులోకి వస్తుండడంతో అంత రేటు పెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. దీంతో మూడు యూనిట్లు నిర్మాణం ఆగిపోతుందని భావించారు. కానీ ఎన్టిపిసి స్వయంగా యూనిట్లు నిర్మాణానికి పూనుకున్నది. విద్యుత్ డిమాండ్ దృష్ట్యా ఇతర రాష్ట్రాలకు కూడా అమ్ముకునే అవకాశం ఉండడం వల్ల ఎన్టిపిసి ముందడుగు వేసింది. దీంతో జూన్ 5న గ్లోబల్ టెండర్లు పిలిచింది నెల రోజుల లోపల టెండర్లు పూర్తి చేయాలని బిడర్లను ను ఆహ్వానించింది. ఈ మూడు యూనిట్ల నిర్మాణం ఆరు సంవత్సరాల్లో పూర్తి చేయాలని షరతులు విధించింది. దీంతో 2 030 కల్లా ఈ మూడు యూనిట్లలో విద్యుత్ పత్తి జరుగుతుంది. భూ సేకరణకు పని లేకపోవడం దగ్గర్లోనే బొగ్గు అందుబాటులో ఉండడంతో ఎన్టిపిసి ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో 2030 కల్లా రామగుండంలో ఎన్టిపిసి 6,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది. 185 మెగావాట్ల సోలార్ విద్యుత్ కూడా ఉత్పత్తి జరుగుతుంది. దీంతో దేశంలోనే అత్యధిక విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్రాంతంగా రామగుండం రికార్డు సృష్టించే అవకాశం ఉంది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609